# సాక్షి
## ఖమ్మం

శుక్రవారం । 3 । నవంబర్ । 2023






**బీజేపీ.. మరో మూడు**

ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. మరో మూడింటికి పేర్లు వెల్లడించింది. IIలో



**... కొనుగోళ్లు నిలిపివేత**

లావాదేవీల నగదును అధికారులు సీజ్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోళ్లు నిలిపేశారు. IIలో

**వాతావరణం**

గరిష్ఠం / కనిష్ఠం

33° / 23°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత గంటగంటకు చలి పెరిగే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### టీజీవోస్ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం టీడీవోస్ కాలనీలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీవోస్) భవనాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో టీజీవోస్ కీలకపాత్ర పోషించాలని సూచించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కస్తాల సత్యనారాయణతో పాటు ఎస్.కే.ఖాజామియా, శేషప్రసాద్, రమేష్, కనపర్తి వెంకటేశ్వర్లు, రవీంద్రప్రసాద్, వేలాద్రి, మంజుల, శారద, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

### ఎక్సైజ్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్

**1800 425 2523**

ఖమ్మంక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన అక్రమ మద్యం నిల్వలు, అమ్మకాలు, సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523ను అందుబాటులోకి తీసుకొచ్చామని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమంగా ఎవరైనా మద్యం నిల్వ చేసినా, అమ్మినా తమకు తెలియచేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు బయటకు వెల్లడించమని తెలిపారు. కాగా, షాపుల్లో అమ్ముతున్న మద్యం బాటిళ్లు సరైనవా, లేదా అని తెలుసుకునేందుకు లేబుల్‌పై ఉండే బార్ కోడ్‌ను వెరిట్ యాప్ (Verit app) ద్వారా స్కాన్ చేస్తే వివరాలు వస్తాయని వెల్లడించారు.

### ఎన్నికల పరిశీలకుల నియామకం

ఖమ్మం క్రైం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన కేంద్ర ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారీగా పరిశీలనులను నియమించింది. ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా, భద్రతకు సంబంధించి ఐపీఎస్‌లను పరిశీలకులుగా కేటాయించారు. ఈమేరకు సాధారణ పరిశీలనకు గాను ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు తుషార్ కాంత మొహంతి, మధిర, వైరాకు కానారామ్, సత్తుపల్లికి సత్యేంద్రసింగ్ నియమితులయ్యారు. ఇక భద్రత అంశాల పరిశీలన కోసం ఖమ్మం, పాలేరుకు డాక్టర్ సార్థక్ సారంగి, మధిర, వైరా, సత్తుపల్లికి హెచ్.మంజునాథ్‌ను నియమించారు. ఆయా అధికారులు పోలింగ్ ముగిసే వరకు ఎన్నికల సరళి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ ఉద్యోగులకు సూచనలు ఇవ్వనున్నారు.

### నాణ్యమైన కూరగాయలే వినియోగించాలి



కూరగాయలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

ఖమ్మంలీగల్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన కూరగాయలు, సామగ్రి వినియోగించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా సూచించారు. ఖమ్మంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను గురువారం ఆయన తనిఖీ చేసి వంటగది, భోజనశాలతో పాటు సరుకులను పరిశీలించారు. కూరగాయల కొనుగోలు సమయాన అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే, ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు.

### సదరమ్ క్యాంప్‌ల నిర్వహణలో గందరగోళం

ఖమ్మం వైద్యవిభాగం: దివ్యాంగులకు సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు నిర్వహించే క్యాంప్‌ల విషయంలో గందరగోళం నెలకొంది. ఎలాంటి ప్రకటన లేకుండా క్యాంప్‌లు నిలిపేయడంతో అర్హులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 10నుండి డిసెంబర్ 27వ తేదీ వరకు క్యాంపుల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేయగా, తొలిరోజు క్యాంపు నిర్వహించారు. ఆతర్వాత చాలామంది స్లాట్ బుకింగ్ కోసం మీసేవా కేంద్రాలకు వెళ్తే నిరాశ ఎదురవుతోంది. ఎలాంటి ప్రకటన లేకుండా నిలిపేయడలో సరికాదని ఆవేదన చెందుతుండగా, సాఫ్ట్‌వేర్ సమస్యతోనే బుకింగ్ నిలిచిపోయిందని సిబ్బంది చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పష్టత ఇవ్వాలని దివ్యాంగులు కోరుతున్నారు.

# నేటి నుంచి కీలకఘట్టం



ఖమ్మం ఆర్‌ఓ కార్యాలయమైన కేఎంసీలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



కేఎంసీలో హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

- అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి
- ఈనెల 10 వరకు స్వీకరణ
- సిద్ధమవుతున్న పార్టీల అభ్యర్థులు

**నామినేషన్లు ఎక్కడెక్కడ..**

| నియోజకవర్గం | కార్యాలయం | రిటర్నింగ్ అధికారి |
|---|---|---|
| ఖమ్మం | కేఎంసీ | ఆదర్శ్ సురభి |
| పాలేరు | ఖమ్మం రూరల్ తహసీల్ | ఎం.రాజేశ్వరి |
| వైరా | తహసీల్ | సత్యప్రసాద్ |
| మధిర | తహసీల్ | జి.గణేష్ |
| సత్తుపల్లి | తహసీల్ | ఏ.అశోక్‌చక్రవర్తి |

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన ఘట్టానికి సమయం ఆసన్నమైంది. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగా, శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించనుండగా, ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెలవులు మినహా ఈనెల 10వ తేదీ వరకు ఉదయం 11నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం 13న పరిశీలన చేయనుండగా, 15వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశమిస్తారు. అదేరోజు పోటీలో మిగిలిన అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు.

**దేవుళ్ల ఆశీస్సులు.. ముహూర్తాలు..**

బరిలో నిలవనున్న అభ్యర్థులు మంచి ముహూర్తాలు చూసుకుని నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మధిర కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ దిగుతున్నారు. ఈనెల 4న ముదిగొండ మండలం ఎడవల్లిలోని యోగానంద నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాక ప్రచారం మొదలుపెడతారు. ఆయన 9వ తేదీన నామినేషన్‌కు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. ఇక సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకవీరయ్య కూడా 9వ తేదీనే నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ప్రకటించారు.

**ఆన్‌లైన్‌లోనూ అవకాశం**

ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాహనాలు, సభలు, ర్యాలీల అనుమతి కోసం దీనిద్వారానే దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో నామినేషన్‌ను సైతం ఆన్‌లైన్‌లో దాఖలు చేసే అవకాశం కల్పించారు. అయితే నామినేషన్ వేసిన రోజు నుంచి 10వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తుతో సంబంధిత ధృవపత్రాలను రిటర్నింగ్ అధికారికి నేరుగా అందించాల్సి ఉంటుంది.

**నిబంధనలు, అర్హతలు**

- శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తికి కనీసం 25ఏళ్ల వయస్సు ఉండాలి.
- నామినేషన్ దాఖలు సమయంలో భారత పౌరుడినని, రాజ్యాంగం, భారత సార్వభౌమత్వానికి లోబడి వ్యవహరిస్తానని ప్రమాణ పత్రం సమర్పించాలి.
- రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండొచ్చు. అయితే, సొంత నియోజకవర్గం నుంచి కాకుండా ఇతర చోట్ల పోటీ చేస్తే ఓటు హక్కు ఉన్నట్లు ధృవీకరణ పత్రాన్ని నామినేషన్‌కు జతచేయాలి.
- ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేసినా ప్రతిపాదించే వారు మాత్రం అదే నియోజకవర్గ ఓటర్లు అయి ఉండాలి.
- జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు డిపాజిట్‌గా చెల్లించాలి.
- రిజర్వ్‌డ్ స్థానాల్లో పోటీ చేసే వారు, ఇతర రత్రా అభ్యర్థులు కుల ధృవీకరణపత్రాలు సమర్పించాలి.
- బీ ఫారాలు ఇచ్చే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలపై ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థినైతే పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే అవకాశమిస్తారు.
- నామినేషన్‌తో పాటే అభ్యర్థులు కొత్తగా తెరిచిన బ్యాంక్ ఖాతా వివరాలు అందజేయాలి.

జంగ్ తెలంగాణ

# వేచి చూసి.. బరిలోకి!

- పోటీ చేసే స్థానాలను ప్రకటించిన సీపీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 17, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు స్థానాలు
- సీపీఐ కలిసొస్తుందని ఎదురుచూపు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీఆర్‌ఎస్‌తో పొత్తు పొసగక పోవడంతో కాంగ్రెస్‌తో జత కట్టేందుకు సీపీఎం నేతలు ఎదురుచూసినా ఓ కొలిక్కి రాలేదు. తొలుత బీఆర్‌ఎస్‌తో పొత్తుపై చాన్నాళ్లు ఊగిసలాట కొనసాగింది. ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించేయడంతో సీపీఎం, సీపీఐ కాంగ్రెస్‌తో పొత్తుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో చర్చలు జరిపాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అల్టిమేటం జారీ చేసినా కాంగ్రెస్ నుంచి స్పందన రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా పోటీచేసే 17 స్థానాలను గురువారం వెల్లడించారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఏడు స్థానాలు ఉన్నాయి. ఇక సీపీఐ శుక్రవారం వరకు కాంగ్రెస్‌కు గడువు విధించిన నేపథ్యాన ఆ పార్టీ కలిసొస్తుందని సీపీఎం ఎదురుచూస్తోంది.

**అసెంబ్లీలో ప్రాతినిధ్యం కోసం..**

ఈసారి ఎలాగైనా అసెంబ్లీలో అడుగు పెట్టాలన్న వ్యూహంతో సీపీఎం, సీపీఐ తొలుత బీఆర్‌ఎస్‌తో పొత్తు కోసం సంప్రదింపులు జరిపాయి. అయితే, ఆయా పార్టీలు పోటీ చేయాలనుకున్న స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించగా పొత్తు అంశం ముగిసింది. ఆ తర్వాత కాంగ్రెస్‌తో పొత్తుకు చర్చలు జరుగుతున్నా.. రెండు జాబితాలు విడుదల చేసిన కాంగ్రెస్ ఎటూ తేల్చలేదు. గత ఎన్నికల్లో సీపీఐ కాంగ్రెస్‌తో, సీపీఎం బీఎల్‌ఎఫ్‌తో జట్టు కట్టాయి. అయినా ఆ రెండు పార్టీలకు ఉమ్మడి జిల్లాలో ఒక్క స్థానమూ దక్కలేదు. దీంతో ఈసారి ఎలాగైనా అసెంబ్లీలో ప్రాతినిధ్యం దక్కించుకోవాలని రెండు పార్టీలు ఎన్నికలను క్రియాశీలకంగా తీసుకున్నాయి. కాగా, రాష్ట్రంలో మిర్యాలగూడ, వైరా స్థానాలను సీపీఎంకు ఇచ్చేలా కాంగ్రెస్ పార్టీతో చర్చించారనే ప్రచారం జరిగినా ఓ కొలిక్కి రాలేదు. ఈ పరిణామాలతో సీపీఎం జారీ చేసిన అల్టిమేటం గడువు కూడా తీరగా చివరకు పోటీ చేసే స్థానాల జాబితా విడుదల చేశారు.

**ఎక్కడెక్కడ ?**

రాష్ట్రవ్యాప్తంగా గతంలో విజయం సాధించిన స్థానాలు, కొంతమేర ఓట్లు సాధించిన స్థానాల్లో సీపీఎం పోటీ చేయాలని నిర్ణయించింది. మొత్తంగా 17 స్థానాలతో జాబితా విడుదల చేయగా, ఉమ్మడి జిల్లా నుంచి భద్రాచలం, అశ్వారావుపేట, పాలేరు, మధిర, వైరా, ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ఖమ్మం నుంచి ఆ పార్టీ నేతలు యర్రా శ్రీకాంత్ లేదా వై.విక్రమ్, పాలేరు నుంచి తమ్మినేని వీరభద్రం లేదా బండి రమేష్, సత్తుపల్లి నుంచి మాచర్ల భారతి, వైరా నుంచి భూక్యా వీరభద్రం, మధిర నుంచి పాలడుగు భాస్కర్, భద్రాచలం నుంచి కారం పుల్లయ్య పోటీ చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థుల పేర్లు ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

**సీపీఐ కూడా వస్తే..**

ఈ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం ఒకే బాటలో నడవాలని అంగీకారానికి వచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్‌కు విధించిన గడువు ముగియడంతో సీపీఎం పోటీ చేసే స్థానాలను ప్రకటించింది. కానీ శుక్రవారం వరకు గడువు పెట్టిన సీపీఐ నేతలు ఇంకా ఎదురు చూసే ధోరణిలో ఉన్నారు. అయితే ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం స్థానాన్ని సీపీఎం ప్రకటించలేదు. కాగా, సీపీఐ కలిసొచ్చి వైరాలో ఆ పార్టీ అభ్యర్థిని నిలబెడితే సీపీఎం దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు సమాచారం. అప్పుడు సీపీఐ కొత్తగూడెం, వైరాలో అభ్యర్థులను బరిలోకి దించనుంది. కాంగ్రెస్ తీరుతో తాము తీసుకున్న నిర్ణయానికి సీపీఐ కలిసొస్తుందని సీపీఎం భావిస్తుండగా, ఏ విషయం శుక్రవారం తేలే అవకాశముంది.

# కేసీఆర్‌పై ప్రజలకు ప్రేమ తగ్గలేదు..

- ప్రజా ఆశీర్వాద సభలకు స్పందనే నిదర్శనం
- ఈనెల 5న ఖమ్మం, కొత్తగూడెంకు సీఎం కేసీఆర్
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే వెంకటవీరయ్య, డీసీసీబీ, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్లు కూరాకుల, కోటేశ్వరరావు తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు పాలేరు, సత్తుపల్లి, ఇల్లెందుల్లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు మంచి స్పందన వచ్చిందని.. కేసీఆర్‌పై ప్రజలకు ఇసుమంతైనా ప్రేమ తగ్గలేదని చెప్పడానికి ఈ సభలే నిదర్శనమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 5న ఖమ్మం, కొత్తగూడెంలో జరిగే సభలకు కేసీఆర్ హాజరుకానుండగా, భారీగా జన సమీకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో నిర్వహించే సభకు ఖమ్మం నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కొత్తగూడెం సభకు హాజరుకానున్న కేసీఆర్, అక్కడి నుంచి ఖమ్మం వస్తారని తెలిపారు. సభ బాధ్యతలు ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధు చూస్తారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఖమ్మం నియోజకవర్గానికి మంత్రి అవకాశం ఇవ్వలేదని, కేసీఆర్ ఇచ్చిన అవకాశంతో రూ.3వేల కోట్లు నిధులు సాధించి అభివృద్ధి చేశానని తెలిపారు. ఖమ్మం మున్నేరుపై ఎప్పుడో బ్రిడ్జి కట్టాల్సి ఉన్నా.. కొందరు నిర్లక్ష్యం చేశారన్నారు. కానీ తాను తీగల వంతెనకు నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ సత్తుపల్లి, ఇల్లెందు సభలకు భారీగా హాజరైన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, జహీర్‌అలీ, పులిపాటి ప్రసాద్, ఉప్పల వెంకటరమణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, ఆకులమూర్తి, శేషగిరిరావు పాల్గొన్నారు. కాగా, మంత్రి పువ్వాడ, ఎంపీలు నామా నాగేశ్వరరావు, రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ మధు ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు.

# ఖమ్మం సమగ్రాభివృద్ధే లక్ష్యం

- కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు
- మాజీ ఎంపీ పొంగులేటితో కలిసి పలు కార్యక్రమాలకు హాజరు



ర్యాలీలో అభివాదం చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: అత్యధిక మెజార్టీతో తనను గెలిపిస్తే ఖమ్మం సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని పలు డివిజన్లలో గురువారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనాలతో పాటు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ 28 రోజులు తన కోసం కష్టపడి పనిచేస్తే రానున్న ఐదేళ్లు అభివృద్ధే లక్ష్యంగా పాటుపడతానని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఓటమి భయంతోనే దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పోరాటాల ద్వారా తెచ్చుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ కుటుంబం, వారి ఎమ్మెల్యేలు ఏ విధంగా దోపిడీ చేశారో అందరికీ తెలిసిపోయిందన్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు.

**యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ**

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యాన ఖమ్మంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానం నుండి ఇల్లెందు క్రాస్ రోడ్డు, జెడ్పీ సెంటర్, పాత బస్టాండ్, గాంధీచౌక్ మీదుగా ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో ఖమ్మం, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓపెన్‌టాప్ జీపు నుంచి అభివాదం చేయగా నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ కమర్తపు మురళి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌తో పాటు దీపక్ చౌదరి, కోటయ్యరాజు, దొడ్డా అశోక్, పాలకుర్తి నాగేశ్వరరావు, సుగ్గల ఈశ్వరలింగం, ఝర్నేని రామారావు, బొల్లిశెట్టి నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, శెట్టి రంగారావు, పాదిల రవికుమార్, వడ్డెబోయిన నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ, మైదాన ప్రాంతాల కలయిక

- 2009 పునర్విభజనలో ఏర్పడిన వైరా నియోజకవర్గం
- సుజాతనగర్ రద్దు కావడంతో కొత్తగా ఏర్పాటు
- రెండు జిల్లాల్లోని ఐదు మండలాలతో ఆవిర్భావం
- బొగ్గు గనుల పుట్టినిల్లు సింగరేణి మండలం ఇక్కడే...




వైరా పట్టణం వ్యూ

బానోతు చంద్రావతి

బానోతు మదన్‌లాల్



లావుడ్యా రాములునాయక్

వైరా: పోరాటాల పురిటిగడ్డ, రాజకీయ చైతన్యానికి కేంద్రమైన వైరా నియోజకవర్గం 2009 నియోజకవర్గాల పునర్విభజనలో ఆవిర్భవించింది. వైరాతో పాటు కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, సింగరేణి(కారేపల్లి) మండలాలతో ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటుచేయగా... గిరిజనుల జనాభా అధికంగా ఉండడంతో అదే వర్గానికి రిజర్వ్ చేశారు. జనాభాపరంగా చూసినా, ఓట్ల పరంగా చూసినా నియోజకవర్గంలో అతి పెద్ద మండలం కొణిజర్ల కాగా, రెండో స్థానంలో వైరా ఉంది. ఇక అన్నింటికంటే చిన్న మండలం ఏన్కూరు. నియోజకవర్గంలోని వైరా, కొణిజర్ల మండలాలు మైదాన ప్రాంతంలో, ఏన్కూరు, జూలూరుపాడు, కారేపల్లి మండలాలు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి. కాగా, ఆది నుంచి ఇక్కడ మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం.

**అటూఇటు.. అన్నీ కలిపి**

ప్రస్తుత నియోజకవర్గంలోని వైరా మండలం 2009కి పూర్వం మధిర నియోజకవర్గంలో ఉండేది. కొణిజర్ల మండలంలో సగం ఖమ్మం, మిగతా సగం సుజాతనగర్ నియోజకవర్గంలో ఉండేది. కారేపల్లి మండలం అధిక భాగం ఇల్లెందులో, కొంత సుజాతనగర్ నియోజకవర్గంలో కొనసాగింది. ఇక ఏన్కూరు, జూలూరుపాడు మండలాలు పూర్తిగా సుజాతనగర్ నియోజకవర్గంలో ఉండేవి. ఇవన్నీ కలిపి వైరా నియోజకవర్గం ఏర్పాటుచేశారు. ఏపీలోని కృష్ణా జిల్లా సరిహద్దు ప్రాంతం నుండి ప్రారంభమయ్యే ఈ నియోజకవర్గం ఇల్లెందు నియోజకవర్గం వరకు వ్యాపించి ఉంటుంది. ఈ నియోజకవర్గంలో బీసీల జనాభా 50 వేల పైచిలుకు ఉండగా, ఎస్టీలు 60,650 మంది ఉంటారు. దీంతో ప్రతీ ఎన్నికల్లో గిరిజనులు గెలుపోటములను ప్రభావితం చేస్తున్నారు.

**మూడు ఎన్నికలు.. విభిన్న తీర్పులు**

నియోజకవర్గం ఏర్పడ్డాక 2009 ఎన్నికల్లో టీడీపీ, సీపీఐ, సీపీఎం మహా కూటమిగా ఏర్పడి సీపీఐకి సీటు కేటాయించారు. దీంతో మహాకూటమి అభ్యర్థిగా డాక్టర్ బానోత్ చంద్రావతి పోటీ చేసి 52,989 ఓట్లు సాధించి, సమీప కాంగ్రెస్ అభ్యర్థి భూక్యా రామచంద్ర నాయక్‌పై గెలుపొందారు. 2014 ఎన్నికల్లో సీపీఎం బలపరిచిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పోటీ చేయగా, 59,318 ఓట్లు సాధించి.. టీడీపీ అభ్యర్థి బానోత్ బాలాజీపై గెలిచారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి చంద్రావతికి 5,641 ఓట్లే వచ్చాయి. ఎన్నికల అనంతరం మదన్‌లాల్ వైఎస్సార్ సీపీని వీడి అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి బానోత్ మదన్‌లాల్ పోటీకి దిగగా.. ఇండిపెండెంట్ అభ్యర్థి లావుడ్యా రాములునాయక్ చేతిలో 2,012 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. మదన్‌లాల్‌కు 50,637 ఓట్లు లభించగా, రాములునాయక్‌కు 52,650 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో సీపీఐ నుంచి బానోత్ విజయాబాయి మహా కూటమి అభ్యర్థిగా పోటీ చేసి 32684 ఓట్లు సాధించారు. ఇలా 2018లో ఇండిపెండెంట్ అభ్యర్థి రాములునాయక్ గెలుపొంది రాష్ట్రంలోనే సంచలనం సృష్టించగా.. ఆతర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు.


**నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు**

| మండలం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| వైరా | 21,131 | 22,606 | 02 | 43,739 |
| కొణిజర్ల | 23,616 | 24,661 | 01 | 48,278 |
| ఏన్కూరు | 13,179 | 14,101 | 01 | 27,281 |
| జూలూరుపాడు | 13,444 | 13,812 | 00 | 27,256 |
| కారేపల్లి | 21,815 | 22,383 | 03 | 44,201 |
| మొత్తం | 93,185 | 97,563 | 07 | 1,90,755 |

**రెండు జిల్లాల్లో నియోజకవర్గం**

ప్రస్తుతం రెండు జిల్లాల పరిధిలో వైరా నియోజకవర్గం కొనసాగుతోంది. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి మండలాలు ఖమ్మం జిల్లాలో, జూలూరుపాడు మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉంది.

**బొగ్గు గనులకు పుట్టినిల్లు**



బొగ్గు గనులకు పుట్టినిల్లయిన సింగరేణి(కారేపల్లి) మండలం ఈ నియోజకవర్గంలోనే ఉంది. ఈ మండలంలోని మాధారంలో డోలమైట్ గనులు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ కోట మైసమ్మ జాతర, కోటిలింగాల జాతర, గురవమ్మ జాతరలు ఘనంగా జరుగుతాయి. జూలూరుపాడు మండలం పాపకొల్లులో కాకతీయుల కాలం నాటి శివాలయం, ఏన్కూరు మండలం గార్లొడ్డులో శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయం, నాచారంలో శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామి దేవాలయం, బురద రాఘవాపురంలోని వందేళ్లనాటి శివాలయాలు ఆధ్యాత్మిక క్షేత్రాలు విలసిల్లుతున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన వైరాలో నిజాం కాలం నాటి రిజర్వాయర్ కింద 25వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది.

## క్లుప్తంగా

### మద్యం తరలింపును అడ్డుకోవాలి



చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న నాగేందర్‌రెడ్డి

మధిర/ఎర్రుపాలెం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సరిహద్దుల మీదుగా మద్యం తరలింపు జరగకుండా విస్తృత తనిఖీలు చేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి.నాగేందర్‌రెడ్డి ఆదేశించారు. మధిర డివిజన్‌లోని పలు ఎక్సైజ్ చెక్ పోస్టులను గురువారం తనిఖీ చేశారు. తొలుత ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు వైన్స్‌లో తనిఖీ చేయగా స్టాక్, అమ్మకాలపై ఆరా తీశారు. అనంతరం తెలంగాణ – ఏపీ సరిహద్దు ఎర్రుపాలెం మండల పరిధి రాజుపాలెం, బోనకల్‌లోని సరిహద్దు చెక్ పోస్టుల్లో తనిఖీ చేసి మద్యం, నల్లబెల్లం, పటిక, గంజాయి రవాణాను అడ్డుకోవాలని సూచించారు. మధిర ఎక్సైజ్ సీఐ ఎం.ప్రసాద్, ఎస్సైలు ఎం.సురేష్, చంద్రశేఖర్, శార్వాణి, ఉద్యోగులు సీహెచ్.గోపి, షేక్ రియాజ్, షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

### రూ.70 వేల నగదు సీజ్



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

ఏన్కూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ గురువారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో పోలీసులు రూ.70వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడెం నుండి ఖమ్మంకు కారులో వెళ్తున్న వ్యక్తి రూ.70 వేల నగదు లభించగా, ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు చెక్‌పోస్టు అధికారి ప్రవీణ్, ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

### 30 మద్యం సీసాలు స్వాధీనం

కారేపల్లి: మండలంలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధి దుబ్బతండా గ్రామంలో పోలీసులు గురువారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కిరాణ దుకాణం నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

### వైరా ఎమ్మెల్యే వాహనం తనిఖీ



ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కారేపల్లి: కారేపల్లి క్రాస్ రోడ్డు సమీపాన ఏర్పాటుచేసిన చెక్ పోస్టు వద్ద వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ వాహనాన్ని పోలీసులు గురువారం తనిఖీ చేశారు. కారేపల్లి మండలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రచారంలో పాల్గొనేందుకు ఆయన వెళ్తుండగా ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన తనిఖీ చేశాక, ఎమ్మెల్యే ముందుకు సాగారు.

### జేవీఆర్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గొర్ల వీరారెడ్డి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ అధ్యాపకుడు గొర్ల వీరారెడ్డికి డాక్టరేట్ లభించింది. మధ్యప్రదేశ్‌లోని శ్రీకృష్ణ విశ్వవిద్యాలయం నుంచి ఆయన కంప్యూటర్స్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. గత 22ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో ఉన్న వీరారెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్, కోఆర్డినేటర్ పి.రామచంద్రరావు, అధ్యాపకులు అభినందించారు.

**బచ్చోడు వాసికి...**



డాక్టరేట్ స్వీకరిస్తున్న నాగరాజు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన తిమ్మిడి నాగరాజుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఓయూలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఆయన పీహెచ్‌డీ పూర్తిచేయగా ఇటీవల స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నారు. ఆయనను గ్రామస్తులు అభినందించారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| మొక్కజొన్న | 2,000 | 2,000 |
| పెసలు | 7,700 | 5,500 |
| మిర్చి | 19,000 | 13,500 |
| ఏసీ మిర్చి | 25,000 | 19,000 |
| పత్తి | 6,850 | 6,000 |

– ఖమ్మం వ్యవసాయం

# అయ్యగారూ.. నమస్కారం!

- ముహూర్తాల కోసం సంప్రదిస్తున్న పార్టీ అభ్యర్థులు
- నేటి నుంచి మొదలుకానున్న నామినేషన్లు
- పుట్టిన నక్షత్రం, పేరు ఆధారంగా ముహూర్తాలు ఖరారు




ఖమ్మంగాంధీచౌక్: శాసనసభ ఎన్నికల సంగ్రామంలో కీలకఘట్టం శుక్రవారం నుంచి మొదలుకానుంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు శుక్రవారం నుంచి నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈనెల 10వ తేదీ వరకు గడువు ఉండగా.. మంచి ముహూర్తం చూసి నామినేషన్ దాఖలు చేయాలని అభ్యర్థులు భావిస్తున్నారు. ఇందుకోసం అర్చకులు, పండితులను సంప్రదించి పేరు, నక్షత్రం ఆధారంగా ఏ రోజు బాగుంటుందనే ఆరా తీస్తున్నారు. నిర్ణీత వ్యవధిలో 3, 4, 8, 9, 10వ తేదీల్లో ముహూర్తం బాగుందని పండితులు, సిద్ధాంతులు చెబుతున్నారు. మరికొందరు 3, 4, 8, 9వ తేదీల్లో ముహూర్తాలు బాగున్నాయని పేర్కొంటున్నారు. దీంతో అభ్యర్థులు తమకు తెలిసిన పండితులను ఆశ్రయించి ముహూర్తబలంపై ఆరా తీస్తున్నారు.

**నక్షత్రాలు, పేరు ఆధారంగా ముహూర్తాలు...**

అభ్యర్థుల పుట్టిన నక్షత్రం, పేరు ఆధారంగా నామినేషన్ల దాఖలుకు ముహూర్తం ఖరారు చేస్తున్నట్లు పండితులు వెల్లడించారు. అలాగే, నామినేషన్ల దాఖలు రోజున ప్రత్యేక పూజలు నిర్వహించడం, ఇష్ట దైవాల ఆలయాలను సందర్శించాలని అభ్యర్థులు భావిస్తున్నారు. ఇక మరికొందరు సర్వమత ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**నామినేషన్లకు మంచి రోజులు!**

- **3వ తేదీ శుక్రవారం :** ఉత్తరా నక్షత్రంతో కూడిన ముహూర్త బలం బాగుంటుందని పండితులు చెబుతున్నారు.
- **4వ తేదీ శనివారం :** సప్తమి పుబ్బ నక్షత్రం కావడంతో బాగుండగా, ఆ రోజు ఎక్కువ మంది నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.
- **8వ తేదీ బుధవారం :** పునర్వసు నక్షత్రం కూడా నామినేషన్ల దాఖలుకు ముహూర్తం బాగుంటుందని పండితులు తెలిపారు.
- **9వ తేదీ గురువారం :** దశమి విష్ణు తిథిగా పేర్కొనే ఏకాదశి కావడంతో మంచి రోజుగా చెబుతున్నారు. ఈరోజునే సీఎం కేసీఆర్ సైతం రెండు చోట్ల నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు.
- **10వ తేదీ శుక్రవారం :** ముస్లిం అభ్యర్థులైతే పవిత్రంగా భావించే ఇదే రోజు నామినేషన్ల దాఖలకు ఆసక్తి చూపే అవకాశముంది.

### ముహూర్తంతో కార్యం.. శుభప్రదం



మంచి ముహూర్తం చూసుకుని కార్యం చేపట్టడం శుభప్రదం. శుభకార్యాల మాదిరిగానే నామినేషన్ దాఖలుకు ముహూర్తాలు నిర్ణయిస్తాం. ఆయా ముహూర్తాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇష్ట దైవాలను కొలిచి ముందుకు సాగితే శుభ ఫలితాలు వస్తాయి. పలువురు అభ్యర్థులు ఇప్పటికే పుట్టిన నక్షత్రం, పేరు ఆధారంగా నామినేషన్ల దాఖలుకు ముహూర్తాలు నిర్ణయించుకున్నారు.

– ఆమంచి అంబరీష్‌శర్మ, పురోహితులు, ఖమ్మం

# బీజేపీ.. మరో మూడు!

- సత్తుపల్లి, పాలేరు, పినపాకకు అభ్యర్థుల ప్రకటన
- ఇంకా ఐదుచోట్ల ఆశావహుల ఎదురుచూపులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను గురువారం ప్రకటించింది. మొదటి జాబితాలోనే ఇల్లెందు, భద్రాచలం అభ్యర్థులుగా డి.రవీంద్రనాయక్, కుంజా ధర్మా పేర్లు వెల్లడించారు. ఇప్పుడు మూడో జాబితాలో పాలేరు, పినపాక, సత్తుపల్లికి స్థానం దక్కింది. పాలేరు నుంచి నున్నా రవికుమార్, సత్తుపల్లి నుంచి నంబూరి రామలింగేశ్వరరావు, పినపాక నుంచి పొడియం బాలరాజు పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, కొత్తగూడెం, వైరా, మధిర, అశ్వారావుపేట స్థానాల నుంచి కూడా అభ్యర్థులను బరిలోకి దింపేందుకు అధిష్టానం కసరత్తు చేస్తోంది. దీంతో టికెట్లు ఆశిస్తున్న నేతలు ఎదురుచూపుల్లో నిమగ్నమయ్యారు.

### అభ్యర్థుల బయోడేటా...



నియోజకవర్గం : సత్తుపల్లి
పేరు : నంబూరి రామలింగేశ్వరరావు
భార్య, కుమారులు : శిరీషరావు, రాంచరణ్‌తేజ్, శేషుక్రాంత్ పృథ్వీతేజ్
వయస్సు : 52 ఏళ్లు
విద్యార్హత : బీఎఫ్‌ఏ (బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, జేఎన్‌టీయూ, హైద్రాబాద్)
పార్టీ బాధ్యతలు : బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్



నియోజకవర్గం : పాలేరు
పేరు : నున్నా రవికుమార్
స్వగ్రామం : మోటాపురం, నేలకొండపల్లి
తల్లిదండ్రులు : లక్ష్మి, వెంకటయ్య
భార్య, కుమారులు : కనకదుర్గ భవాని, రోహిత్‌కుమార్, పూజిత్‌కుమార్, విద్యార్హత : ఇంటర్
రాజకీయ ప్రస్థానం : సీపీఎం అనుబంధ డీవైఎఫ్‌ఐ డివిజన్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆయన 1993లో బీజేపీలో చేరారు. పార్టీ నేలకొండపల్లి మండలం ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడుగా పనిచేశాక ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గుర్రంపోడు భూముల పోరాటం విషయంలో 40 రోజుల పాటు ఆయన జైలులో ఉన్నారు.

# నియోజకవర్గానికో నంబర్

**రాష్ట్ర జాబితాలో మనవి ఆఖరున...**

ఖమ్మంసహకారనగర్: వ్యవహారికంలో మనందరం అసెంబ్లీ నియోజకవర్గాలను పేరుతో పిలుస్తాం. కానీ సాంకేతికంగా, ఎన్నికల సంఘం విధుల్లో భాగంగా పరిశీలిస్తే ప్రతీ నియోజకవర్గానికి ఓ నంబర్ ఉంటుంది. విద్యార్థులకు పాఠశాలలో ఇచ్చినట్లు ఓ క్రమసంఖ్య కేటాయించారు. దేశవ్యాప్తంగా ఇలాగే ఉంటుంది. ఎన్నికల కమిషన్ విధుల్లో ఈ నంబర్ ఆధారంగానే రిజర్వేషన్లు, విధుల కేటాయింపు, ఇతరత్రా అన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాల పేర్లతో పాటు నంబర్లను కూడా తప్పకుండా వినియోగిస్తుంటారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల నంబర్లు ఇవి...!

**నియోజకవర్గాల వారీగా నంబర్లు ఇలా..**

| | |
|---|---|
| పినపాక | 110 |
| ఇల్లెందు | 111 |
| ఖమ్మం | 112 |
| పాలేరు | 113 |
| మధిర | 114 |
| వైరా | 115 |
| సత్తుపల్లి | 116 |
| కొత్తగూడెం | 117 |
| అశ్వారావుపేట | 118 |
| భద్రాచలం | 119 |

# ‘ఏ’ ఫామ్ తెలుసా..?



ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయ పార్టీకి సంబంధించిన అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే సమయంలో ‘బీ’ ఫామ్ సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థికి ఆయా పార్టీలు బీ ఫామ్ జారీ చేస్తాయి. ఇందులో అభ్యర్థి, పార్టీ పేరు, గుర్తు.. అసెంబ్లీ నియోజకవర్గం వివరాలతోపాటు పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్ పత్రాలతో పాటు బీ ఫామ్ జత చేస్తేనే ఎన్నికల రిటర్నింగ్ అధికారి పార్టీ గుర్తు కేటాయిస్తారు. అలాగే, ‘ఏ’ ఫామ్ కూడా ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది. బీ ఫామ్‌ను సంబంధిత పార్టీ ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఇందులో పార్టీ పేరు, పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులందరి పేర్లు, ఎక్కడెక్కడి నుంచి ఎవరు పోటీ చేస్తున్నారనే తదితర వివరాలు ఉంటాయి. ‘ఏ’ ఫామ్ కింద మూడు చోట్ల పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. ఈ సంతకాలను ఫోర్జరీ చేయకుండా ఈ జాగ్రత్త వహిస్తారు. అభ్యర్థులందరూ ‘బీ’ ఫామ్‌లను నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులకు సమర్పించాక, ‘ఏ’ ఫామ్‌ను ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. ఈ రెండింటిని పోల్చి చూసుకున్నాక అభ్యర్థి సదరు పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లుగా ఎన్నికల సంఘం నిర్ధారిస్తుంది.

# రోజువారీగా నివేదిక అందించండి

**బ్యాంకు లావాదేవీలపై కలెక్టర్ గౌతమ్**



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో లెక్కకు మించిన నగదు జమ, విత్‌డ్రా వివరాలతో రోజువారీగా నివేదిక ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం బ్యాంకర్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలో అనుమానంగా ఉన్నవే కాకుండా ఒకే రోజు రూ.10 లక్షలు, అంతకు మించి జరిగే లావాదేవీలు, ఒకే ఖాతా నుండి పది ఖాతాలకు నగదు బదలాయించినా గుర్తించాలని తెలిపారు. అలాగే, ఏటీఎంల్లో నగదు డిపాజిట్ చేయడానికి వినియోగించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటుచేయాలని తెలిపారు. ఆయా వాహనాల వెంట సరైన పత్రాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ జీఎం కె.నర్మద, ఏపీజీవీబీ ఏజీఎం బి.విజయ భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

**ఎలాంటి లోపాలు ఎదురుకావొద్దు**

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: అసెంబ్లీ నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం మొదలుకానుండగా.. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఎలాంటి సమస్య ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం రూరల్ తహసీల్‌ల్లో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆయా కార్యాలయాలను గురువారం తనిఖీ చేసిన కలెక్టర్‌మాట్లాడుతూ నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు, ప్రతిపాదకుల కోసం సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే, భద్రత దృష్టి సారించి ఎవరు కూడా నిబంధనలు అతిక్రమించకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్‌ల్లో సిబ్బందిని నియమించి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని సూచించారు. ఖమ్మం, పాలేరు రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, రాజేశ్వరి, ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్లు సీహెచ్.స్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అభ్యర్థి ఖర్చు పరిమితి రూ.40 లక్షలు

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. అందులో ప్రధానంగా పార్టీ నుంచి లేదా స్వతంత్రంగానైనా పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయొద్దు. సభలు, సమావేశాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాల పంపిణీ, ప్రచార ప్రకటనలు, వీవీఐపీలు పాల్గొనే బహిరంగ సభల ఏర్పాట్ల ఖర్చులన్నీ ఇందులోనే చేయాల్సి ఉంటుంది. అలాగే, అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతా తెరిచి నామినేషన్ వేసినప్పటి నుంచి అందులో నుంచే నగదు ఖర్చు చేయాలి. అంతేకాక వ్యయం వివరాలు, బిల్లులను పూర్తి వివరాలతో నియోజకవర్గాల వ్యయ పరిశీలకులకు సమర్పించాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

### గ్రామాల్లో పోలీస్ బలగాల కవాతు

రఘునాథపాలెం: ప్రజలు అభద్రతా భావాన్ని తొలగించిన స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూసేందుకు పోలీసులు మండలంలోని మంచుకొండ, బూడిదంపాడు, పాపటపల్లి గ్రామాల్లో గురువారం కవాతు నిర్వహించారు. స్థానిక పోలీసులతో పాటు రిజర్వ్‌డ్ బలగాలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రఘునాథపాలెం సీఐ కె.శ్రీధర్ పాల్గొన్నారు.



కవాతులో పాల్గొన్న పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు



# మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిపివేత

- వ్యాపారి నగదును పోలీసులు సీజ్ చేయడంతో నిరసన
- ఉన్నతాధికారులతో చర్చించిన చాంబర్ ప్రతినిధులు



పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో వేచి ఉన్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: ఎన్నికల నిబంధనల్లో భాగంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది ఎదురవుతోందని ఆరోపిస్తూ వ్యాపారులు గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు నిలిపివేశారు. ఖమ్మం మార్కెట్‌లో పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే ఓ వ్యాపారి రైతులకు చెల్లించేందుకకు బ్యాంకు నుంచి రూ.9 లక్షల నగదు తీసుకొస్తుండగా, బుధవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు అనుమానించారు. ఆయన ఇంటి వరకు వెంట వెళ్లి తనిఖీ చేయగా రూ.9 లక్షల నగదు ఉండడంతో సీజ్ చేశారు. దీంతో సదరు వ్యాపారి ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ దిగుమతి(అడ్తీ) శాఖ ప్రతినిధులను ఆశ్రయించగా వారు గురువారం మార్కెట్‌లో మిర్చి, పత్తి తదితర పంటల కొనుగోళ్లు నిలిపేశారు. దీంతో ఉదయం 7:30 గంటల నుంచి రెండు గంటల పాటు కొనుగోళ్లు నిలిచిపోగా, చాంబర్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్ తదితరులు చేరుకుని వ్యాపారులతో చర్చించారు. అంతేకాక సమస్యను పోలీసు, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వగా, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం కూడా కోరడంతో కొనుగోళ్లు మొదలుపెట్టారు. అనంతరం చాంబర్ ప్రతినిధులు సమస్యను పోలీసు కమిషనర్‌కు వివరించగా ఆయన ఏసీపీకి సూచనలు చేశారు.

### 5న శ్రీనివాస కల్యాణం

ఖమ్మం గాంధీచౌక్ : శ్రీ వైష్ణవ సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5న స్థానిక పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సామూహిక సుదర్శన హోమం, శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేషభట్టర్ రఘునాథాచార్యులు, కొదమసింహం రవికిరణ్ తెలిపారు. సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీవైష్ణవ సేవా సంఘం ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మార్చిలో జరిగే రజతోత్సవాల నిర్వహణపైనా చర్చిస్తామని పేర్కొన్నారు. ఆదివారం నాటి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, శ్రీ వైష్ణవ సేవా సంఘం గౌరవ సలహాదారు కె.వి రమణాచారి, అధ్యక్షులు ఎస్టీ చారి, ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహన్, ఎస్సీహెచ్ రామకృష్ణమాచార్యులు తదితరులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని శ్రీ వైష్ణవులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో రామకృష్ణమాచార్యులు, భార్గవాచార్యులు, ఫణికుమార్, శేష భట్టర్ పవన్‌కుమార్, ఓలేటి శ్రీనివాసాచార్యులు, కండ్లకుంట రవికిరణ్, పాండురంగాచార్యులు, నాగులవంచ రమణ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వైరా: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్, కబడ్డీ ఎంపిక పోటీల్లో వైరా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపికైన గోపీచంద్, కృష్ణతేజను ఆర్‌సీఓ అంజలి, ప్రిన్సిపాల్ మల్లయ్య, పీఈటీ రవి తదితరులు అభినందించారు.

### జీవీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళకు శస్త్రచికిత్స

రఘునాథపాలెం: మండలంలోని చెరువు కొమ్ముతండాకు చెందిన గుగులోత్ సక్రి గర్భసంచిలో సమస్య ఎదురవగా జీవీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేయించినట్లు ట్రస్ట్ బాధ్యుడు గుర్రం సత్యనారాయణ తెలిపారు. ఖమ్మంలోని బృందా ఆస్పత్రిలో చికిత్స చేయించామని చెప్పారు. ఈ ఈ ఆపరేషన్‌కు రూ.లక్ష నుండి రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుందని, పేద మహిళ కావడంతో ట్రస్ట్ ద్వారా అండగా నిలిచినట్లు తెలిపారు.

### రేపు క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఈనెల 4వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులు కె.నర్సింహారావు, స్టెల్లా ప్రేమ్‌నిరంజన్ తెలిపారు. రోప్ స్కిప్పింగ్, స్క్వాష్, బీచ్ వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 80199 52592 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### వార్డెన్‌కు షోకాజ్ నోటీసు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఎస్సీ సంక్షేమశాఖ బాలుర ‘సీ’ వసతిగృహం సంక్షేమ అధికారి శ్రీధర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. కుమారుడికి సీటు కావాలని వచ్చిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించారన్న ఆరోపణలతో ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీలత ద్వారా విచారణ చేయించారు. నివేదిక అందిన అనంతరం వార్డెన్‌కు నోటీసులు జారీ చేసినట్లు డీడీ తెలిపారు. ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### కార్మికురాలిని వేధించిన కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా పారిశుద్ధ్య కార్మికురాలితో అసభ్యకరంగా ప్రవర్తించిన కాంట్రాక్టర్‌పై పలువురు కేఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు కాంట్రాక్టర్ 53వ డివిజన్‌లో పనిచేసే ఓ కార్మికురాలికి మూడు నెలలుగా వేతనం ఇవ్వడం లేదు. ఇదేమిటని అడిగితే తాను చెప్పినట్లు చేయాలని వేధించడంతో ఆమె అధికారులకు ఫిర్యాదు చేసింది. అయితే, ఫిర్యాదు చేసిన ఆమెను కాంట్రాక్టర్ పనిలోకి రాకుండా అడ్డుకున్నట్లు తెలిసింది. కేఎంసీ అధికారులను వివరణ కోరగా.. ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

### సారా విక్రేతకు 228 రోజుల రిమాండ్

కారేపల్లి: ఏన్కూర్ మండలానికి చెందిన ఓ మహిళ సారా విక్రయిస్తూ పట్టుబడగా 228 రోజుల రిమాండ్ విధించారు. కారేపల్లి ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూర్ మండలానికి చెందిన కుమారి గత జూన్ 16న సారా విక్రయిస్తూ పట్టుబడడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కానీ ఆమె నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ సారి విక్రయిస్తూ పట్టుబడింది. దీంతో రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉన్నా కట్టకపోవడంతో ఎక్సైజ్ పోలీసులు ఆమెను అరెస్టు చేసి తహసీల్దార్ ముందు హాజరుపర్చగా 228 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం ఆమెను ఎక్సైజ్ పోలీసులు గురువారం జిల్లా జైలుకు తరలించారు.

### రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

మధిర: మధిరలో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడుకు చెందిన కోట శంకర్ ద్విచక్ర వాహనంపై మధిర నుంచి ఇంటికి వెళ్తుండగా, ఒడిశాకు చెందిన గంగాధర్ బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను ఆస్పత్రికి తరలించారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-11-2023

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▲ 490 | నిఫ్టీ ▲ 144 |
| 64,081 | 19,133 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 13,260 | ▲ 199 |
| డోజోన్స్ | 33,721 | ▲ 446 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,447 | ▲ 104 |
| డాక్స్ | 15,144 | ▲ 220 |
| షాంఘై | 3,009 | ▲ 14 |
| నికాయ్ | 31,950 | ▲ 348 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | | |
| 61,092 | ▲ | 80 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | | |
| 60,847 | ▲ | 79 |
| వెండి (కేజీ) | | |
| 71,684 | ▲ | 700 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటికి | 82.49 | 84.26 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటికి | 99.73 | 101.94 |
| € | యూరో | ఒకటికి | 86.78 | 89.19 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటికి | 54.27 | 55.87 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటికి | 51.63 | 54.39 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటికి | 59.12 | 60.98 |
| SAR | సౌదీ రియాల్ | పదింటికి | 21.23 | 22.86 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | పదింటికి | 21.87 | 23.49 |
| ¥ | చైనా యువాన్ | పదింటికి | 10.23 | 12.29 |

# పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

## బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్‌ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్‌లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

# కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

**51% కొనుగోలు; డీల్ విలువ రూ. 4,051 కోట్లు**

ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.

# ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్లు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్లు అజియో ప్రకటించింది.

# దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

**మరిన్ని వివరాలు..**

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్‌అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

# గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా


**రూ. 63,000 కోట్ల ఒప్పందం**

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

# మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటోకార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

# లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్‌ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్‌ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

**ఇకపై మరింత దూకుడు:** తాజా సమీక్షా కాలంలో జేఎల్‌ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్థం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

**ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.**

## జిల్లా వార్తలు

# 14న ఢిల్లీలో స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం

**సింగరేణి నుండి సభ్యుడిగా డైరెక్టర్ బలరామ్**



సింగరేణి(కొత్తగూడెం): ఢిల్లీలో ఈనెల 14న కోలిండియా(సీఐఎల్) స్టాండర్డైజేషన్ కమిటీ మొదటి సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా 11వ వేతన ఒప్పందానికి సంబంధించి అమలుకాని అంశాలపై చర్చిస్తారు. అలాగే, జేబీసీసీఐలో చర్చించిన డిమాండ్లను ఈ కమిటీకి బదిలీ చేయగా సమీక్షించనున్నారు. కమిటీలో మొత్తం 11 మంది సభ్యులు ఉండగా, సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరామ్ సభ్యుడిగా సమావేశానికి హాజరవుతారు.

# భద్రాద్రి జిల్లా వాసులు ఇద్దరికి డాక్టరేట్




డాక్టరేట్ అందుకుంటున్న రవి



మధుసూదన్‌రావు

దమ్మపేట/దుమ్ముగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని గణేష్‌పాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రవి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్నారు. ఓయూలో ఎమ్మెస్సీ పూర్తిచేసిన ఆయన వజ్రాల అన్వేషణ, వెలికితీత రంగంపై పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. దీంతో ఇటీవల ఓయూ స్నాతకోత్సవంలో ఆయన పీహెచ్‌డీ అందుకోగా, గ్రామస్తులు అభినందించారు. అలాగే, దుమ్ముగూడెం మండలం నర్సాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నాంపల్లి మధుసూదన్‌రావు కూడా ఓయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ రేఖాశర్మ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావును ఎంఈఓ సున్నం సమ్మయ్య, హెచ్ఎం బోళ్ల వెంకటేశ్వర్లు, ఎంఎస్‌సీ చైర్మన్ మద్దుకూరి విద్యాసాగర్, పాఠశాల నిర్మాణ దాత సూదిరెడ్డి రమణారెడ్డి తదితరులు అభినందించారు.

# గోటి తలంబ్రాల వరికి సీమంత పూజ

- ఏపీలోని కోరుకొండలో పండిస్తున్న భక్తులు
- 13 ఏళ్లుగా స్వామివారి కల్యాణంలో వినియోగం



వరి పంటతో ఈఓ రమాదేవి, భక్త బృందం

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఏటా నిర్వహించే సీతారాముల కల్యాణంలో వినియోగించే కోటి గోటి తలంబ్రాల వరి పంటకు గురువారం సీమంతం పూజ నిర్వహించారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యాన పండిస్తున్న వరి పంట ప్రస్తుతం పొట్ట దశకు చేరుకుంది. దీంతో కొంత వరి పంటను రామయ్య సన్నిధికి తీసుకురాగా అర్చకులు శాస్త్రోక్తంగా సీమంతం పూజ నిర్వహించారు. ముందుగా ఆలయ ఈఓ రమాదేవి కోటి గోటి తలంబ్రాల వరి పంటతో ఆలయానికి పాదయాత్రగా వచ్చిన భక్తుల కు స్వాగతం పలికారు. శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యాన గత 13 ఏళ్లుగా వరి పండించి గోటిలో వలిచిన తలంబ్రాలను రామయ్య కల్యాణానికి సమర్పిస్తున్నట్లు అధ్యక్షుడు కళ్యాణం అప్పారావు తెలిపారు. ఈకార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, అధికారులు, సిబ్బంది, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా పాఠశాలల క్రీడా జట్ల ఎంపిక



కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాలల అండర్-14 క్రీడా జట్లను ఎంపిక చేశారు. అథ్లెటిక్స్, కబడ్డీ, హ్యాండ్‌బాల్ క్రీడా జట్లను ఎంపిక చేయగా, పోటీలకు 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆయా జట్లు సిద్దిపేట, మంచిర్యాల, జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని జిల్లా క్రీడా కార్యదర్శులు కె.నర్సింహారావు, స్టెల్లా ప్రేమ్ నిరంజన్ తెలిపారు. ఈ ఎంపిక పోటీలను అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ ఎండీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు అసోసియేషన్ బాధ్యులు, పీఈటీలు సుధాకర్, రవి, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, ముజాహిద్, సైదేశ్వరరావు, కృష్ణ వీరరాఘవయ్య, వై.రామారావు, ఎ.కృష్ణ, రంజాన్, లాలయ్య, రాము, వీరన్న, చంద్రశేఖర్, రాంబాబు, సుజాత, హర్షిత, ఎం.అంజయ్య, సత్యనారాయణ, రమేష్ పర్యవేక్షించారు.

# పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత



మొక్క నాటుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంఅర్బన్: ప్రతీ ఒక్కరు పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాంగణంలో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడడమే కాక పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అలాగే, నీడనిచ్చే మొక్కలు, పండ్లు, పూల మొక్కలను నాటి సంరక్షిస్తే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు తానాజీ, ఎస్టార్ శ్రీనివాస్, ఆదినారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

# కేటీపీఎస్‌లో నిరంతరాయంగా విద్యుదుత్పత్తి

**9వ యూనిట్‌లో 250 మెగావాట్ల చొప్పున వంద రోజులు**

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంలోని 250 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 9వ యూనిట్ నిరంతరాయం వంద రోజులు మైలురాయిని విజయవంతంగా పూర్తిచేసింది. ఈ సందర్భంగా గురువారం 5, 6వ దశల విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సీఈ ఎం.ప్రభాకర్‌రావును సన్మానించారు. అనంతరం సీఈ మాట్లాడుతూ విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పనిచేయడంతోనే రికార్డు స్థాయిలో ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. ముందస్తు ప్రణాళికతో సమష్టిగా పనిచేస్తూ సంస్థ ప్రగతికి పాటుపడాలని సూచించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఈ.శ్రీనివాస్, పి.సురేశ్‌బాబు, డి.ఉమామహేశ్వరరావు, జయభాస్కర్, రాజశేఖర్, భాస్కర్, చంద్రశేఖర్, ప్రకాశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీఈని సన్మానిస్తున్న ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

# క్రీడా కార్యదర్శి నియామకంలో ఇష్టారాజ్యం

- కేయూలో నిబంధనలకు నీళ్లొదిలిన అధికారులు
- రెండు దశాబ్దాలకు పైగా సంబంధం లేని వారికే పోస్ట్
- పోటీల సమయంలో పర్యవేక్షణ లేక క్రీడాకారుల అవస్థ
- ప్రస్తుత క్రీడా కార్యదర్శిని మారిస్తే పీడీలనే నియమించాలని డిమాండ్

ఖమ్మంస్పోర్ట్స్: రెండు దశాబ్దాలకు పైగా కాకతీయ యూనివర్సిటీలో క్రీడా విభాగం (స్పోర్ట్స్ బోర్డ్) కార్యదర్శిగా ఇతర సబ్జెక్టులు బోధించే వారినే నియమిస్తున్నారు. పలువురు అర్హులైన ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నా పాలకవర్గం పట్టించుకోకపోవడంపై క్రీడావర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. క్రీడలు, పోటీలపై ఎలాంటి అవగాహన లేని వారిని నియమించడంలో యూనివర్సిటీ ఆంతర్యం ఏమిటో తెలియరావడం లేదు. క్రీడలపై కనీస అవగాహన లేని వారిని నియమిస్తుండటంతో సంపూర్ణ క్రీడాభివృద్ధి సాధ్యం కావడం లేదని వాపోతున్నారు. అయితే, క్రీడా కార్యదర్శిగా తమను ఎందుకు నియమించారనేది అర్థం కావడం లేదని ఆ పదవిలో కొనసాగిన వారు చెబుతుండటం గమనార్హం.

**అన్ని అర్హతలు ఉన్నా..**


కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగిన పలువురు పీడీలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారినే ప్రిన్సిపాల్, స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శిగా నియమించాల్సి ఉంటుంది. అయినా కాకతీయ యూనివర్సిటీ ఆ దిశగా ఆలోచించకపోవడంపై సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లను ప్రిన్సిపాళ్లుగా అవకాశం కల్పించినా కేయూలో అలా జరగడం లేదని చెబుతున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న వారిని ప్రిన్సిపాళ్లుగా నియమించినా, క్రీడల కార్యదర్శిగా మాత్రం అర్హత కలిగిన వారిని విస్మరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కేయూ పరిధిలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో పలువురు సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. వారిని పరిగణనలోకి తీసుకుని క్రీడా కార్యదర్శిగా నియమిస్తే క్రీడాకారులకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## సర్టిఫికెట్ల పంపిణీలో ఆలస్యం

కాకతీయ యూనివర్సిటీ క్రీడా జట్ల తరపున పాల్గొనే క్రీడాకారులకు సర్టిఫికెట్లను సకాలంలో అందించడంలో స్పోర్ట్స్ బోర్డు విఫలమవుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో సర్టిఫికెట్లు క్రీడాకారులకు అందక పలువురు విద్య, ఉద్యోగావకాశాలు కోల్పోయినట్లు తెలిసింది. కాగా, క్రీడా సంఘాల ఆధ్వర్యాన జరిగే పోటీల్లో వెంటనే సర్టిఫికెట్లు అందిస్తున్నారు. లేదంటే ఆన్‌లైన్‌లో తీసుకోవాలని సూచిస్తే 15 నుంచి 20 రోజుల్లో వారికి సర్టిఫికెట్లు అందుతున్నాయి. కానీ, స్పోర్ట్ బోర్డ్ ఆధ్వర్యాన అలా జరగకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# సంక్రాంతి కల్లా ఆ కుటుంబం జైలుకే..

**బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్**



సత్తుపల్లి బీజేపీ అభ్యర్థి నంబూరిని అభినందిస్తున్న దియోధర్, నాయకులు

సత్తుపల్లి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సంక్రాంతి కల్లా కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపించడం ఖాయమని బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్ తెలిపారు. సత్తుపల్లిలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఆయన కుటుంబీకులు ప్రజల సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 2014లో ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేలు, 2018లో ఒక ఎమ్మెల్యే గెలిస్తే ఏ ఒక్కరు పార్టీ మారలేదని తెలిపారు. కానీ కాంగ్రెస్ నుంచి గెలిచిన 18 మందితో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. కాగా, సత్తుపల్లి బీజేపీ అభ్యర్థిగా నంబూరి రామలింగేశ్వరరావును ప్రకటించడంతో ఆయనను దియోధర్ అభినందించారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు త్రిలోకేశ్వర్, బి.వీరంరాజు, కె.వెంకట్రామయ్య, నున్నా రవి, శ్యాంథోడ్, రాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, మట్టా ప్రసాద్, బొర్రా నర్సింహారావు, పాలకొల్లు శ్రీను, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

V
సాక్షి
# ఫ్యామిలీ
ఖమ్మం
శుక్రవారం ॥ 3-11-2023

● టెక్.. టాక్

## హువావే నోవా 11 ఎస్ఈ



సైజ్: 6.67 అంగుళాలు; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
బరువు: 186 గ్రా. బ్యాటరీ: 4500 ఎంఏహెచ్
కలర్స్: గ్రీన్, వైట్, బ్లాక్ ● 5జీ కనెక్టివిటీ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్

## లెనోవా ట్యాబ్ పీ12



సైజ్: 12.7 అంగుళాలు
రిజల్యూషన్: 1840×2944
వోఎస్: ఆండ్రాయిడ్ 13 కలర్స్: స్టోర్మ్ గ్రే, ఓట్
ఇంటర్నల్: 128జీబి 4జీబి ర్యామ్ / 128జీబి 8జీబి ర్యామ్ / 256 జీబి 8జీబి ర్యామ్
బరువు: 615 గ్రా. బ్యాటరీ: 10200 ఎంఏహెచ్

## పోట్రానిక్స్ స్క్రీన్ క్లీనర్



బ్రాండ్: పోట్రానిక్స్ కలర్: బ్లూ
మెటీరియల్: ప్లష్ బరువు: 50 గ్రా.
కంపాటబుల్ డివైజెస్: మానిటర్, ట్యాబ్లెట్ స్క్రీన్, స్మార్ట్ ఫోన్స్

## గూగుల్ పాస్‌కీస్

ఆండ్రాయిడ్ డివైజ్‌ల కోసం సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ సరికొత్త క్రెడెన్షియల్ మేనేజర్‌ను తీసుకు రానుంది. 'పాస్ కీస్' ద్వారా ఈ టూల్ మన లాగిన్ అవసరాలకు ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ ఎకౌంట్స్‌లో లాగిన్ కావడానికి ఇదో కొత్త విధానం. దీని ద్వారా యూజర్‌లు పాస్‌వర్డ్ ఉపయోగించకుండానే వెబ్‌సైట్‌లు, అప్లికేషన్‌లలో లాగిన్ కావచ్చు. రైట్ అథంటికేషన్ మెథడ్ ద్వారా క్రెడెన్షియల్ మేనేజర్ 'పాస్‌కీస్' మరో లెవల్‌కు తీసుకువెళ్లనుంది.



## ఇన్‌స్టాలో ఇంటర్నెట్ యాక్టివిటీ ట్రాకింగ్ స్టాప్ చేయడానికి...



● ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రొఫైల్ పిక్చర్ టాప్ చేయాలి
● టాప్ రైట్ కార్నర్‌లో ఉన్న మూడు హారిజంటల్ లైన్స్‌ను టాప్ చేయాలి
● సెట్టింగ్ అండ్ ప్రైవసీ-సెలెక్ట్
● ట్యాప్-యాక్టివిటీ
● ట్యాప్-యాక్టివిటీ ఆఫ్ మెటా టెక్నాజీస్
● ట్యాప్-డిస్‌కనెక్ట్ ఫ్యూచర్ యాక్టివిటీ

## అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్




చాట్‌బాట్ కోసం 'అడ్వాన్స్‌డ్ డాటా ఎనాలసిస్' అనే కొత్త ఫీచర్ గురించి ప్రకటించింది ఓపెన్ ఏఐ. దీని ద్వారా యూజర్‌లు పీడీఎఫ్ ఫైల్స్, డాటా ఫైల్స్, ఇతర ఫైల్స్ అప్‌లోడ్, ఎనాలసిస్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. సుదీర్ఘమైన డాక్యుమెంట్‌ల నుంచి సంక్షిప్త సమాచారం, రకరకాల డాటా పాయింట్స్‌ను అర్థం చేసుకోవడానికి, డాటా ఆధారంగా గ్రాఫ్స్ అండ్ చార్ట్స్ జనరేట్ చేయడానికి ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

● సక్సెస్ స్టోరీ



ప్రమోద్ గాడ్గే

'భవిష్యత్ అనేది రకరకాల వస్తువులతో కూడిన బాక్స్‌లాంటిది. మనం తీసినప్పుడు ఏ వస్తువు చేతికందుతుందో తెలియదు. కొన్నిసార్లు నిరాశపరిచే వస్తువు, కొన్నిసార్లు అత్యంత విలువైన వస్తువు చేతికి అందవచ్చు'... ఈ సినిమా డైలాగ్‌ను ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌లు విన్నారో లేదో తెలియదుగానీ 'అన్‌బాక్స్' రూపంలో వారికి బాక్స్ నుంచి విలువైన కానుక లభించింది. తమ భవిష్యత్‌నే మార్చేసిన స్టార్టప్ కానుక అది.
లాజిస్టిక్ ఆటోమేషన్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రోబోటిక్స్'తో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు ప్రమోద్, షాహీద్‌లు...



షాహీద్ మెమన్

అన్‌బాక్స్

# అదరగొట్టారు

'మన దేశంలో ఇ-కామర్స్ వేగం పెరిగింది' అనే వార్త చదివి 'ఓహో అలాగా!' అనుకోవచ్చు. అద్భుతమైన 'ఐడియా' కూడా రావచ్చు. ఆ ఐడియా జీవితాన్నే మార్చేయవచ్చు. ప్రమోద్ గాడ్గే, షాహీద్ మెమన్‌ల విషయంలో జరిగింది ఇదే. మన దేశంలో ఇ-కామర్స్ స్పీడ్‌ను గమనించిన వీరు సప్లై చైన్ రోబోటిక్స్ స్టార్టప్ 'అన్‌బాక్స్ రొబోటిక్స్'తో విజయ పథంలో దూసుకుపోతున్నారు. ఇండియా దాటి యూఎస్, యూరప్ మార్కెట్‌లోకి కూడా అడుగు పెట్టనున్నారు.

పుణే కేంద్రంగా మొదలైన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సప్లై చైన్ ఆటోమేషన్ సోల్యూషన్స్‌లో మార్పు తీసుకువచ్చింది. వినూత్న ఏఐ-ఆధారిత కంట్రోల్ సిస్టమ్ ద్వారా రోబోట్‌ల ఉత్పాదకతను పెంచింది. పనితీరును మార్చింది.

'మానవ శక్తి నుంచి రోబోట్స్ వరకు ప్యాకేజీలను క్రమబద్ధీకరించడం, రవాణా చేయడం... మొదలైన విధానాలు మన దేశంలో ఇ-కామర్స్ వేగాన్ని అందుకోలేకపోతున్నాయేమో అనిపించింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మొబైల్ రోబోటిక్స్ సిస్టమ్‌ను నిర్మించాలనుకున్నాం. లాజిస్టిక్స్, రిటైల్ ప్లేయర్‌ల కోసం ప్యాకేజీ సార్టింగ్, ఆర్డర్ కన్సాలిడేషన్ ప్రక్రియలను ఆటోమేట్ చేయడానికి శక్తిమంతమైన రోబోటిక్స్ వ్యవస్థను నిర్మించాలనుకున్నాం' గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు 'అన్‌బాక్స్ రోబోటిక్స్' సీఈవో ప్రమోద్ గాడ్గే.

'అన్‌బాక్స్ రోబోటిక్స్'కు ముందు ఫ్లిప్‌కార్ట్‌లో సార్టింగ్‌కు సంబంధించి ఆటోమేషన్ విభాగంలో, మన దేశంలోని తొలి రోబోట్-బేస్డ్ సార్టింగ్ ప్రాజెక్ట్‌లో పనిచేశాడు ప్రమోద్.

'అన్‌బాక్స్ రోబోటిక్స్' కో-ఫౌండర్, సీటీవో షాహీద్ రోబోటిక్స్. ఇంటెలిజెన్స్ సిస్టమ్స్, స్వార్మ్ ఇంటెలిజెన్స్‌లో మంచి అనుభవం ఉంది. రోబోటిక్స్, ఆటోమేషన్ ఫీల్డ్స్‌లో సీటీవోగా పనిచేశాడు.

'అన్‌బాక్స్'కు ముందు 'వనోర రోబోట్స్' అనే స్టార్టప్ ప్రారంభించాడు.

చిత్తశుద్ధి, కష్టపడే తత్వం, అంకితభావం లేకపోతే పేపర్ మీద రాసుకున్న కాన్సెప్ట్ అక్కడే నిలిచిపోతుంది.

అయితే ఈ ఇద్దరు మిత్రులు వారి బృందం బాగా కష్టపడి 'అన్‌బాక్స్'ను సూపర్ హిట్ చేశారు.

> స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది.




స్టార్టప్ కాన్సెప్ట్‌లో సత్తా ఉంటే ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేయరు. 'అన్‌బాక్స్' విషయంలోనూ అదే జరిగింది. టీమ్‌ను విస్తరించడానికి, అంతర్జాతీయ స్థాయిలో కస్టమర్‌ల డిమాండ్‌ను నెరవేర్చడానికి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై సమీకరించిన నిధులను వాడారు.

2021లో థర్డ్-పార్టీ లాజిస్టిక్స్, ఇ-కామర్స్ ప్లేయర్స్‌తో కంపెనీ బీటా పైలట్స్ లాంచ్ చేసినప్పుడే లీడింగ్ ఇ-కామర్స్ లాజిస్టిక్స్ కంపెనీల నుంచి ఆర్డర్లు రావడం మొదలైంది. ఇది భవిష్యత్ విజయానికి సూచికలా పనిచేసింది. ఇన్వెస్టర్‌లలో మరింత నమ్మకాన్ని నింపింది.

'అన్‌బాక్స్' స్టార్టప్ ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్‌లాంటి సెక్టార్‌లలో ఏడు పెద్ద సంస్థలతో కలిసి పనిచేస్తోంది. క్లయింట్ సబ్‌స్క్రిప్షన్ మోడల్ 'రోబోట్ యాజ్ ఏ సర్వీస్'ను కూడా కంపెనీ ప్రారంభించింది.

ఇ-కామర్స్, లాజిస్టిక్స్, రిటైల్ రంగాలకు సంబంధించి రోబోటిక్-బేస్డ్ ఫుల్‌ఫిల్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ టెక్నాలజీలో ప్రత్యేకత సాధించిన 'అన్‌బాక్స్ రోబోటిక్స్' అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతుంది.

# యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్




### ఏ హెడ్‌స్టార్ట్

ఏదైనా విషయంలో, పోటీలో, పరీక్షలో....ఒక వ్యక్తికి అడ్వాంటేజ్ ఉంటే వాడే మాట... ఏ హెడ్‌స్టార్ట్.
ఉదా: మెర్లిన్స్ బ్యూటీ అండ్ నేచురల్ గ్రేస్ గేవ్ హర్ ఏ బిగ్ హెడ్‌స్టార్ట్ ఇన్ ది మోడలింగ్ అండ్ యాక్టింగ్

### పాసింగ్ ది బక్

ఒక పనిలో తన రెస్పాన్సిబిలిటీని తప్పించుకోవడంలో భాగంగా నెపాన్ని ఇతరుల మీద నెట్టి బ్లేమ్ చేసే సందర్భంలో వాడే మాట...పాసింగ్ ది బక్.
ఉదా: డోన్ట్ ట్రై టు పాస్ ది బక్- దిస్ ఈజ్ యువర్ రెస్పాన్సిబిలిటీ, నాట్ మైన్.

● మ్యూజిక్ వరల్డ్

## సంగీతమే శ్వాసగా...

కోల్‌కతాకు చెందిన సింగర్, సాంగ్ రైటర్ అమిక శైల్. తొమ్మిది సంవత్సరాల వయసులో 'లిటిల్ చాంప్స్' రియాలిటీ షోలో పాల్గొంది. ఫోక్, జాజ్, క్లాసిక్‌లో 'వావ్' అనిపించుకుంది. డిగ్రీ పూర్తయిన తరువాత తన కలను సాకారం చేసుకోవడానికి ముంబైకి వచ్చింది. 'స్ట్రగుల్' అంటే ఏమిటో అప్పుడే తెలిసింది. సినిమాల్లో పాడడానికి చేసే ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. హిందుస్థానీ క్లాసిక్ మ్యూజిక్‌లో అమికకు మంచి పట్టు ఉంది. అవకాశాలు వచ్చే వరకు ఖాళీగా కూర్చోవడం ఎందుకని మ్యూజిక్ టీచర్‌గా జాబ్‌లో చేరింది. ఎట్టకేలకు 'వెడ్డింగ్ యానివర్సరీ' సినిమాతో బ్రేక్ వచ్చింది. ఎన్నో టీవీ సీరియల్స్‌కు టైటిల్ సాంగ్స్ పాడింది. ఎన్నో రియాల్టీ షోలలో పాల్గొంది. 'సంగీతం అనేది నాకు అభిరుచి కాదు శ్వాస లాంటిది. సంగీత సాధనకు ఎన్ని గంటలైనా సరిపోవు. యాంత్రికంగా, మొక్కుబడిగా కాకుండా ప్రశాంత చిత్తంతో సంగీత సాధన చేయాలి' అంటున్న అమిక నటిగా కూడా రాణిస్తోంది. 'పవర్‌ఫుల్ డైలాగులో చెప్పడంలో.



అమిక శైల్

సరియైన భావోద్వేగాలు ప్రదర్శించడంలో నాలోని సింగర్ గురువులా మార్గదర్శనం చేస్తోంది' అంటుంది అమిక శైల్.



అమిక శైల్

● గేమింగ్



## అగ్గిబరాట

అడ్వెంచర్ వీడియో గేమ్ 'థ్రస్టీ సూటర్స్' విడుదల అయింది. యంగ్ లేడీ జాల తన సోదరి వివాహం సందర్భంగా స్వస్థలానికి వస్తుంది. ఆ తరువాత ఏమైంది అనేది ఈ గేమ్. సంస్కృతి, భావోద్వేగాలు, కుటుంబ ఒత్తిళ్లు, బంధాలకు ఈ గేమ్ కేంద్రబిందువు. సినిమాటిక్, టర్న్-బేస్డ్ బ్యాటిల్ సీక్వెన్స్‌లు ఉంటాయి.

**గేమ్ ప్లే:** కంబాట్, స్కేట్ బోర్డింగ్, కుకింగ్
**జానర్స్:** రోల్-ప్లేయింగ్ గేమ్, అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్, అడ్వెంచర్
**ప్లాట్‌ఫామ్స్:** ప్లే స్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్ బాక్స్ వన్, ప్లే స్టేషన్ 4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్, సిరీస్ ఎస్

# సినిమా



● రామ్‌చరణ్

## ఆస్కార్ యాక్టర్స్ బ్రాంచ్‌లో...

రామ్ చరణ్‌కి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' (ఆస్కార్ కమిటీ) తాజాగా వెల్లడించిన 'మెంబర్ క్లాస్ ఆఫ్ యాక్టర్స్' జాబితాలో రామ్‌చరణ్‌కి సభ్యత్వం దక్కింది. 'ఆర్ఆర్ఆర్'లో రామరాజు పాత్రలో అద్భుతంగా నటించినందుకుగాను చరణ్‌కి ఈ స్థానం లభించింది. కాగా 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఆ మధ్య విడుదల చేసిన యాక్టర్స్ బ్రాంచ్‌లో తెలుగు నుంచి ఎన్టీఆర్‌కి చోటు దక్కిన విషయం తెలిసిందే. తాజాగా రామ్‌చరణ్‌తో పాటు మరికొందరు హాలీవుడ్ నటీనటులకు ఈ కమిటీలో చోటు దక్కింది. ''ఈ నటులు వెండితెరపై తమ ప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించారు. వాస్తవానికి, కల్పితానికి మధ్య వారధులుగా నిలిచారు. ఎన్నో సినిమాల్లో వారి నటనతో పాత్రలకు ప్రాణం పోశారు. వారి కళతో సాధారణ సినిమాతో ప్రేక్షకులకు అసాధారణ అనుభవాలను అందిస్తున్నారు. అలాంటి వారిని 'యాక్టర్స్ బ్రాంచ్'లోకి ఆహ్వానిస్తున్నాం'' అని సోషల్ మీడియా వేదికగా ఆస్కార్ అకాడమీ ప్రతినిధులు షేర్ చేశారు. కాగా 96వ ఆస్కార్ అవార్డుల వేడుక వచ్చే ఏడాది మార్చిలో జరగనుంది.



హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం ఇటలీలోని టస్కనీలో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వివాహానికి మెగా, అల్లు కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, స్నేహితులు హాజరయ్యారు. హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, కుమారుడు అల్లు అయాన్, కుమార్తె అల్లు అర్హతో కలిసి వివాహానికి హాజరై వధూవరులకు అభినందనలు తెలిపారు.

## మా వ్యూహం మాకుంది

**- రామ్‌గోపాల్ వర్మ**



● కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపలేరు. అలాగే మా 'వ్యూహం' సినిమా విడుదలను కూడా ఆపలేరు. ఈలోగా మా సినిమాపై ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేయకుండా నేనే ముందుకొచ్చి మాట్లాడుతున్నా. ఒకవేళ మా చిత్రం రిలీజ్‌కి అడ్డంకులు సృష్టిస్తే ఏం చేయాలో మా వ్యూహం మాకుంది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా తొలి భాగం ఈ నెల 10న విడుదల కావాల్సి ఉంది. అయితే రిలీజ్‌ని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ-''వ్యూహం' చూసిన సెన్సార్ సభ్యులు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఎందుకు రివైజింగ్ కమిటీకి పంపిస్తున్నారో కారణాలు చెప్పలేదు. దీంతో ప్రస్తుతానికి సినిమా విడుదల వాయిదా వేస్తున్నాం. రివైజింగ్ కమిటీల్లోనూ తేల్చకుంటే 'ఉడ్తా పంజాబ్, పద్మావత్' వంటి హిందీ సినిమాలకు కోర్టు ద్వారా రిలీజ్ ఆర్డర్ తెచ్చుకున్నట్లే మేమూ తెచ్చుకుంటాం. చట్టపరంగా ఉన్న పద్ధతుల ద్వారా 'వ్యూహం'ను రిలీజ్ చేసుకుంటాం. ఈ సినిమా విడుదల ఆపాలని నారా లోకేశ్ సెన్సార్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. అయితే అదెంత నిజమో చెప్పడానికి నా దగ్గర ఆధారాలు లేవు. మీడియా, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు చెప్పినట్లే 'వ్యూహం' ద్వారా నా అభిప్రాయాలు చెప్పాను. అది ఎవరైనా వింటారా? లేదా అన్నది అర్థం లేని ప్రశ్న. సినిమా ఇవ్వడం వరకే నా బాధ్యత'' అన్నారు. ''మా సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినా నష్టం జరగదు. మేము అనుకున్నట్లే అన్నీ సకాలంలో జరుగుతాయని ఆశిస్తున్నాం. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తాం''అన్నారు దాసరి కిరణ్ కుమార్.

## చేయి పోయినా ఆత్మవిశ్వాసంతో సినిమా పూర్తి చేశాను

**- సెబాస్టియన్ నోవా అకోస్టా**



రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'నరకాసుర'. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో డా.అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో సెబాస్టియన్ నోవా మాట్లాడుతూ- ''దర్శకుడు కావాలనేది నా కల. ఓ ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుని అవకాశాల కోసం ప్రయత్నించినా కుదర్లేదు. టెక్నాలజీపై అవగాహన కోసం 2012లో ప్రసాద్ ల్యాబ్‌లో చేరాను. అక్కడ రిలీజ్‌కు నోచుకోని సినిమాలు కనిపించాయి. దీంతో సినిమా తీయడం కాదు.. తీసిన సినిమాను మార్కెట్ చేసుకోవడం ముఖ్యమని భావించి సాయి కొర్రపాటిగారి సహాయంతో డిస్ట్రిబ్యూషన్ రంగంలో చేరాను. ఆ తర్వాత నా దర్శకత్వంలో సినిమా కోసం కథ రెడీ చేసుకున్నాను. చిన్నతనంలో నేను తప్పిపోతే ట్రాన్స్‌జెండర్స్ నన్ను మా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కథకు ఈ సంఘటన ఓ స్ఫూర్తి. ఇక దర్శకుడిగా తొలి అవకాశమే కష్టం అనుకుంటే.. 'నరకాసుర' చిత్రీకరణ టైమ్‌లో ఒరిస్సాలో షూటింగ్ పూర్తి చేసుకుని జబల్‌పూర్ వెళ్తుంటే ప్రమాదం జరిగి, నా చేయి పోయింది. ప్రమాదం జరిగిన తర్వాత 27వ రోజు నేను సెట్స్‌లోకి వచ్చి, ఆత్మవిశ్వాసంతో సినిమాను పూర్తి చేశాను. ఇక మాధవన్, అరుణ్ విజయ్, వివేక్ ఒబెరాయ్, టొవినో థామస్ వంటి స్టార్స్‌తో ట్రైబల్ నేపథ్యంలో ఓ సినిమా ప్లానింగ్‌లో ఉంది. మూడు భాషల్లో చిత్రీకరిస్తాం'' అన్నారు.

## లవ్ డ్యూయెట్



● రితిక, ఆనంద్ దేవరకొండ

ఆనంద్ దేవరకొండ, రితికా నాయక్ జంటగా నటించనున్న సినిమాకు 'డ్యూయెట్' టైటిల్‌ను ఖరారు చేశారు. ఏఆర్ మురుగదాస్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన మిథున్ వరద రాజ కృష్ణన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, స్టూడియో గ్రీన్ పతాకంపై కేజీ జ్ఞానవేల్ రాజా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ఆనంద్ తల్లిదండ్రులు గోవర్ధన్ దేవరకొండ, మాధవి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో హీరోయిన్లపై దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ ఇచ్చారు. తొలి సీన్‌కి దర్శకుడు చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శక-నిర్మాత సాయిరాజేష్, నిర్మాత జ్ఞానవేల్ రాజా, ఈ చిత్ర సహ-నిర్మాత 'మధుర' శ్రీధర్ స్క్రిప్ట్‌ను దర్శకుడు మిథున్‌కు అందజేశారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ- ''డ్యూయెట్' నాకు స్పెషల్ ఫిల్మ్. మిథున్ మంచి కథ రాశాడు'' అన్నారు. ''ఇదొక మంచి లవ్‌స్టోరీ'' అన్నారు మిథున్. ''ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యాను. జీవీ ప్రకాశ్‌కుమార్ ఆల్రెడీ రెండు పాటలు ఇచ్చేశారు. వారం రోజుల్లో తొలి షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ వేడుకకు హీరోలు విజయ్ దేవరకొండ, సత్యదేవ్ అతిథులుగా హాజరయ్యారు.

## ఈ సినిమా నాకో పెద్ద వేడుక

**- 'సత్యం' రాజేశ్**



'సత్యం' రాజేష్, కామాక్షీ భాస్కర్ల ప్రధాన తారాగణంగా, రాకేందు మౌళి, బాలాదిత్య, కరుణకుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. 2021లో వీక్షకుల ముందుకు వచ్చిన 'మా ఊరి పొలిమేర'కు ఇది సీక్వెల్ చిత్రం. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చితాన్ని పంపిణీదారుడు వంశీ నందిపాటి నేడు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర'కు వీక్షకుల నుంచి వచ్చిన స్పందనను బట్టి 'మా ఊరి పొలిమేర 2' చేద్దామని అనుకున్నాం. తొలి భాగం ముగిసిన దగ్గర్నుంచే మలి భాగం ఆరంభమవుతుంది. కొమరయ్య (సినిమాలో 'సత్యం' రాజేశ్ పాత్ర) గురించి నిజాలు తెలుసుకున్న లక్ష్మి (కామాక్షీ పాత్ర) ఏం చేసింది? ఏ విధంగా పగ తీర్చుకోవాలనుకుంది? కవిత ఎలా జీవించి ఉంది? ఇలాంటి ఆసక్తికరమైన కథనంతో మంచి ట్విస్ట్‌లతో సాగుతుంది. నా కెరీర్‌లో ఓ పెద్ద వేడుకలా ఈ సినిమాను భావిస్తున్నాను. ప్రస్తుతం 'గీతాంజలి' సీక్వెల్, వరుణ్‌తేజ్ 'మట్కా' వంటి సినిమాల్లో కీలక పాత్రలు చేస్తున్నాను. హీరోగా 'టెనెంట్' చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

## అలాంటి కార్తీనే ఇష్టపడుతున్నారు!

**- హీరో కార్తీ**



''చేసిన పాత్రలనే మళ్లీ చేస్తే నాకు బోరింగ్‌గా అనిపిస్తుంటుంది. ఎప్పటికప్పుడు వినూత్నంగా, ప్రయోగాత్మకంగా సినిమాలు చేసే కార్తీనే ప్రేక్షకులు కూడా ఇష్టపడుతున్నారు. అంటే నేను నాలా ఉంటే ఆదరిస్తున్నారు. మరొకరిలా ఉండాలనుకోవడం లేదు. కాబట్టి నా తరహా సినిమాలే నేను చేస్తాను'' అని కార్తీ అన్నారు. కార్తీ హీరోగా 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన 'జపాన్' చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కార్తీ చెప్పిన విశేషాలు.

● 'జపాన్' క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్. నిజమైన కథ కాదు. కొన్ని వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను రూపొందించాం. ఈ సినిమా కేవలం వినోదం ఇవ్వడం మాత్రమే కాదు... మన ఉనికిని, అస్తిత్వాన్ని ప్రశ్నించేలా కూడా ఉంటుంది. ప్రస్తుత సమాజాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది. సోషల్ మీడియా అంశాన్ని కూడా టచ్ చేశాం. అలాగే మనకు 'జపాన్' అంటే హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు దాడి గుర్తుకు రావచ్చు. ఆ దాడి తర్వాత జపాన్ దేశం మళ్లీ పుంజుకుని అత్యున్నత స్థాయికి ఎదిగింది. ఈ రిఫరెన్స్ 'జపాన్' పాత్రలో కూడా కనిపిస్తుంది. ● చాలా కాలం తర్వాత మాస్‌తో కూడిన స్ట్రాంగ్ అండ్ సెటైరికల్ రోల్ నాకు మళ్లీ 'జపాన్'తో వచ్చినట్లు అనిపించింది. 'జపాన్' గ్రే క్యారెక్టర్ కాదు.. డార్క్ అంతే. నా క్యారెక్టర్‌లో డార్క్ హ్యూమర్ ఉంటుంది. 'జపాన్' కోసం రెగ్యులర్ కార్తీలా ఉండకూడదని అనుకున్నాను. దర్శకుడు కూడా ఇదే కోరుకున్నారు. ఈ సినిమా కోసం కొత్తగా మేకోవర్ అయ్యాను. నా వాయిస్ మాడ్యులేషన్, హెయిర్ స్టయిల్ అన్నీ కొత్తగా అనిపిస్తాయి. ● నేను నటించిన 'ఊపిరి' సినిమా తమిళ వెర్షన్‌కు దర్శకులు రాజు ముగరున్ డైలాగ్స్ రాశారు. ఆయనలో మంచి హ్యూమర్ ఉందని ఆ సమయంలో అనిపించింది. కానీ రాజుగారు తీసిన 'కుకు', 'జోకర్' సినిమాల్లో ఇది అంతగా లేదు. సాధారణంగా నేను నా కోసం ఏవైనా కథలు ఉన్నాయా? అని ఎవర్నీ అడగ లేదు. తొలిసారి రాజు మురుగన్‌ని అడిగాను. ఓ డార్క్ ఎమోషనల్ స్టోరీ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. ఆ తర్వాత మరో కథలోని ఓ క్యారెక్టర్ నచ్చి, ఆ పాత్ర ఆధారంగా కథ రాయమన్నాను. అలా 'జపాన్' కథ మొదలైంది. రాజు మురుగన్‌గారు గతంలో జర్నలిస్ట్‌గా చేశారు. ఆయన తన జీవితంలో చూసిన కొన్ని ఘటనలను 'జపాన్'లో చూపించే ప్రయత్నం చేశారు. అలాగే నాగార్జునగారి అన్నపూర్ణ స్టూడియోస్‌తో అసోషియేట్ అవ్వడం ఆనందంగా ఉంది. ● దర్శకుడు నలన్‌కుమార్‌తో నేను చేస్తున్న సినిమా 70 శాతం షూటింగ్ పూర్తయింది. '96' ఫేమ్ ప్రేమ్‌కుమార్‌తో ఓ సినిమా చేయనున్నాను. అలాగే 'ఖైదీ 2', 'సర్దార్ 2' చిత్రాలు చేయాల్సి ఉంది.

## ఓ కల ఆధారంగా..



● రోహిత్ నందా

రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ ద్వయం దర్శకత్వం వహించిన చిత్రం 'విధి'. ఎస్. రంజిత్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రోహిత్ నందా మాట్లాడుతూ- ''న్యూజిల్యాండ్‌లో చదువుకున్నాను. నటనపై ఆసక్తితో స్టేజ్ డ్రామాల్లో చేశాను. చిరంజీవిగారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. ఇక 'విధి' సినిమా రా అండ్ రస్టిక్ ఫిల్మ్. రియల్ లైఫ్‌లోని నా క్యారెక్టర్‌కు విభిన్నమైన పాత్రను ఈ సినిమాలో చేశాను. అలాగే మా 'విధి' సినిమాను చూపులేనివారు కూడా ఓ యాప్ సాయంతో ఆస్వాదించవచ్చు. ఈ ఆలోచన నాదే. కొన్ని కొత్త కథలు వింటున్నాను'' అన్నారు. ''మా కుటుంబ సభ్యుల్లో ఒకరికి వచ్చిన ఓ కల ఆధారంగా 'విధి' సినిమా స్టోరీ లైన్‌ను డెవలప్ చేసి, కథ రెడీ చేసుకున్నాం. రోహిత్ బాగా చేశారు'' అన్నారు శ్రీనాథ్, శ్రీకాంత్.

ఫ్యాషన్



# ఉంగరాల గొలుసులు

వేళ్లకి ఉంగరాలు, మెడలో గొలుసులు ధరించడం సాధారణమే! చేతులకు ఉంగరాలు.. చెయిన్లు, హ్యాండ్ కఫ్స్ ధరించడం ఇప్పుడు ట్రెండ్. ఇండోవెస్టన్, వెస్టన్ డ్రెస్సుల మీదకు ఈ ఉంగరాలు, చెయిన్ల వరసలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. యువత వేగానికి, స్టయిల్‌కి అద్దంలా భాసిల్లుతున్నాయి.

### బంగారు వరసలు

లైట్ వెయిట్ జ్యువెలరీలో భాగంగా హ్యాండ్ కఫ్స్, చెయిన్స్ డిజైనర్లను ఆధునికత వైపుగా పరుగులు తీయిస్తున్నాయి. ఆభరణాల డిజైనర్లు బంగారు లోహంతో వెస్టన్ స్టైల్ డిజైన్స్‌ను కొత్తగా మెరిపిస్తున్నారు.

### వెండి వెలుగులు

తక్కువ ఖర్చు అనే జాబితాను ఈ తరం పక్కన పెట్టేస్తోంది. ఏ డిజైన్ తమకు మరింత అందాన్ని తీసుకువస్తుందో, నలుగురిలో గుర్తింపును సంపాదిస్తుందో దానినే ఇష్టపడుతోంది. అందుకే సిల్వర్ డిజైన్స్ మరింతగా యువత మదిని గెలుచుకుంటున్నాయి.

### స్టీల్ మెరుపులు

స్ట్రీట్ అండ్ బోహో స్టైల్‌లో స్టీల్‌తో తయారైన ఆభరణాలను యువత ఎక్కువ ధరిస్తుంటుంది. క్యాజువల్ వేర్, పార్టీవేర్‌కీ నప్పే ఈ డిజైన్ వరసలు వందల రూపాయల నుంచి మార్కెట్‌లో లభిస్తున్నాయి.

బ్యూటిప్స్

వేకువ జాముకు చలి తొంగి చూస్తోంది. కిటికీలో నుంచి దొంగలా గదిలో దూరుతోంది. చల్లగా ఒంటికి హాయినిస్తుంది. కానీ చర్మాన్ని పెళుసుబారుస్తుంది కూడా. అందుకే ఆలస్యంగా చర్మసంరక్షణ మొదలవ్వాలి.

## శీతాకాలానికి స్వాగతం

- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత బాదం నూనె లేదా ఆలివ్ ఆయిల్ రాయాలి.
- గోరువెచ్చటి నీటిని దోసిట్లోకి తీసుకుని ముఖాన్ని నీటిలో మునిగేటట్లు ఉంచాలి. ఇది హాట్‌థెరపీ. రోజుకొకసారి ఉదయం స్నానం చేయడానికి ముందు కానీ రాత్రి పడుకునే ముందుకానీ చేయవచ్చు.
- ఒక కోడిగుడ్డు సొనలో, టీ స్పూన్ కమలారసం, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, నాలుగైదు చుక్కల పన్నీరు, అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత కడిగేయాలి. ఇది పొడిచర్మానికి వేయాల్సిన ప్యాక్.
- బాగా మగ్గిన అరటిపండును మెత్తగా చిదిమి ముఖానికి, మెడకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని కడగాలి. ఇది పొడిచర్మానికి మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది, మెడ నలుపు కూడా వదులుతుంది.



- పొడిచర్మాన్ని మృదువుగా మార్చడంలో గ్రేప్‌సీడ్ ఆయిల్ బాగా పని చేస్తుంది. ఆయిల్‌ను ఒంటికి రాసి మర్దన చేయాలి.
- ఫేస్‌ప్యాక్‌లకు బదులుగా స్వచ్ఛమైన ఆముదం ఒంటికి రాసి మర్దన చేసుకోవాలి. ఆముదం వల్ల చర్మం మృదువుగా మారడంతో పాటు అనేక చర్మ సమస్యలు కూడా తగ్గుతాయి.

పారా హుషార్

# ఇలాంటి వాళ్లకి ఎలా బుద్ధి చెప్పాలి?

బెంగళూరులోని ప్రముఖ మాల్. ఒక పెద్దమనిషి చాలా సేపుగా దేనికో కాచుకుని ఉన్నాడు. ఒక మహిళను గమనించాడు. వెనుక నుంచి వచ్చి ఆమెను అసభ్యంగా తాకి జనంలో కలిసిపోయాడు. కాని ఇది ఎవరో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టారు. బెంగళూరు పోలీసులు అతన్ని పట్టుకోవడానికి రంగంలో దిగారు. రద్దీ ప్రదేశాల్లో స్త్రీలను అసభ్యంగా తాకడం కొందరికి అలవాటు. వీరితో ఎలా అప్రమత్తంగా ఉండాలి? వీరు మన ఇంటి మగవారే అయితే ఏ విధంగా సంస్కరించాలి?

మొన్నటి ఆదివారం జరిగింది ఇది: బెంగళూరులోని ఒక భారీ మాల్‌లో తన కుటుంబంతో షాపింగ్ చేస్తున్న జయప్రకాష్ (30)కి అతని చెల్లెలు దూరంగా ఉన్న ఒక వ్యక్తిని చూపింది. అన్నయ్యా... అతను ఆడవాళ్లను తాకుతున్నాడు అని చెప్పింది. జయప్రకాష్ పెద్దగా పట్టించుకోలేదు కాని కాసేపు ఆ వ్యక్తినే గమనిస్తే అతడు ఉద్దేశపూర్వకంగా ఆడవాళ్లను తాకుతున్నాడని అర్థమైంది. మాల్ రద్దీగా ఉండటంతో అతడు తాకుతున్నా ఆడవాళ్లు ఏదో యాదృచ్ఛికంగా తగిలాడు అన్నట్టుగా ముందుకు కదిలిపోతున్నారు. జయప్రకాష్ వెంటనే తన కెమెరాతో ఆ వ్యక్తి చర్యను రికార్డు చేశాడు. మాల్ వారికి కంప్లయింట్ చేశాడు. అంతేకాదు, సోషల్ మీడియాలో పెట్టాడు. అంతే! ఆ వీడియో దావానలంలా వ్యాపించింది. మాల్ వాళ్లిచ్చిన కంప్లయింట్ ఆధారంగా ఐపిసి సెక్షన్ 354 కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతణ్ణి సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆ వ్యక్తి బెంగళూరుకు చెందిన ఒక రిటైర్డ్ హెడ్‌మాస్టర్. 8 నెలల క్రితమే రిటైర్ అయ్యాడు. వీడియో వైరల్ కావడంతో పోలీసులు రావడం కంటే ముందే అతను కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయాడు. అయినా పోలీసులు వెతుకుతున్నారు.

**ఒక 'చిన్న దుశ్చర్య'- దారుణ ఫలితం:** ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో అసభ్యంగా కొన్ని సెకన్లపాటు తాకడం పెద్ద తప్పేం కాదని మగవారనుకుంటారు. ఇది 'అత్యాచారం' కాదు కదా. బలవంతం చేయడం కాదు కదా... వారికి తెలిసే లోపల తాకి వెళ్లిపోతాం కదా అనుకుంటారు. కాని ఆ సెకన్ల చర్య కూడా స్త్రీలకు తెలుస్తుంది. వికారం కలిగిస్తుంది. ఇప్పుడు ఈ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ చేసిన చర్య బయట పడటంతో అతని పరువు, మర్యాదలు గంగలో కలిశాయి. కన్నడ టీవీ చానెళ్లు అతడి ఫొటో పెట్టి బజారుకు ఈడ్చాయి. పోలీసు కేసు నిరూపితమైతే శిక్ష కూడా పడుతుంది. బహుశా అతనికి ఎదిగొచ్చిన పిల్లలు, కొడుకు, కోడలు, కూతురు... వీరంతా ఉంటే వారి కుటుంబాలు కూడా మాటలు పడాలి. ఇవన్నీ మగవారు ఎందుకు ఆలోచించరు?



**మ్యాన్ టచింగ్:** ఇలా ఆడవాళ్లను పబ్లిక్ ప్లేసుల్లో తాకడాన్ని 'మ్యాన్‌టచింగ్' అని కొందరు అంటారు. ఒక స్త్రీ శరీరం అందుబాటులోకి వస్తే దానిని తాకొచ్చనే గుంపులో గోవింద స్వభావం మగవాణ్ణి ఇందుకు ఉసిగొల్పుతుంది. లైంగిక అభద్రతలు కొందరిని ఇలా చేయడానికి ప్రేరేపిస్తే, లైంగిక ఉద్రేకం కోసం కొందరు ఇలా చేస్తారు. గమనించాల్సిందేమంటే ఈ మగవారంతా మిగతా సమయాల్లో 'పరువు, మర్యాద, మంచి ఉద్యోగం' ఉన్న వ్యక్తులే. అపరిచితులు, పరిచితులు కూడా ఇలా చేస్తారు. ఎవరూ గమనించకుండా శరీర భాగాలు తాకేవారు కొందరైతే, వేదికల మీద పెళ్లిళ్లు, శుభకార్యాలలో పెద్దరికం వహిస్తూ బుగ్గలు పుణకడం, భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకోవడం మరికొందరు చేస్తారు. ఇవన్నీ స్త్రీల అనుమతి లేకుండా వారిని తాకడంగానే భావించాలి.

**మగవాళ్లు దొంగసాకులు:** 1. కొంచెమలా రాసుకుంటే ఏమవుతుంది అనుకోవడం... ఆమె మరీ రెచ్చగొట్టేలా ఉంది అనడం. 2. ఆమె నన్ను రెచ్చగొట్టి తాకేలా చేసింది అనడం 3. పరిచయం ఉన్న ఆమేగా... ఏమనుకుంటుందిలే అనుకోవడం 4. ఆమె పట్ల నా ఇష్టాన్ని తెలిపేందుకు అనడం... ఇలా ఏం చెప్పినా ఒక స్త్రీని ఆమె అనుమతి లేకుండా ఎక్కడా తాకకూడదు.

**నిలువరించాలి:** స్త్రీలు బహిరంగ ప్రదేశాలలో 'ఎందుకులే రచ్చ' అనుకోకుండా ఇలా అసభ్యంగా తాకే వారిని వెంటనే నిలువరించాలి. చూపు ద్వారా, మాట ద్వారా వీరిని ఒక్క క్షణంలో నిలువరించవచ్చు. సాయం తీసుకుని పోలీసులకు పట్టివ్వొచ్చు. పరిచితులు అస్తమానం తాకుతూ ఉన్నా వారికి మొహమాటం లేకుండా తాకొద్దని చెప్పేయాలి. ముఖ్యంగా పిల్లలకు పబ్లిక్ ప్లేసుల్లో ఎవరినీ తాకనీకుండా చూసుకోవాలని హెచ్చరించాలి.

**మన ఇంటి మగవారు:** పై కేసులోని రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌కు కూడా ఒక ఇల్లు ఉంటుంది. ఇలా ఆడవాళ్లను తాకాలని చూసే మగవారు ఏ ఇంటిలో అయినా ఉండొచ్చు. ఇంటి ఆడవాళ్లు మాటల్లో మాటగా ఎవరైనా పబ్లిక్ ప్లేసుల్లో తమను తాకితే ఎంత కంపరంగా ఉంటుందో చెబుతుండాలి. అలా చేసిన వారిని పబ్లిక్‌గా పట్టుకొని దండిస్తే ఎంత అవమానంగా ఉంటుందో చెప్పాలి. స్త్రీలను గౌరవించి వారికి అసౌకర్యం కలిగించే ఏ పనీ చేయరాదని తప్పక చెప్పాలి. అలాగే సామాజిక ఆరోగ్యం కోసం మగవారు తమ చపలత్వాన్ని నివారించుకోవడం తప్పక అభ్యాసం చేయాలి- దొరికి దెబ్బలు తినడం కంటే అదే మేలు.

పురస్కారం

# షేక్‌స్పియరే తన పవర్

'ఏ యుద్ధం ఎందుకు జరిగెనో? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?

తారీఖులు, దస్తావేజులు... ఇవి కావోయ్ చరిత్రకర్థం'... మహాకవి మాట తిరుగులేని సత్యం అయినప్పటికీ కొన్నిసార్లు యుద్ధాలు, తారీఖులు, ప్రేమ పురాణాలు, ముట్టడికైన ఖర్చులు... చారిత్రక పరిశోధనకు అవసరం. ఏ సమాచారమూ వృథా పోదు.

వర్తమానంలో ఉండి ఆనాటి మొగల్, బ్రిటిష్ ఇండియాలోకి వెళ్లడం అంత తేలిక కాదు.


అలుపెరగని పరిశోధన కావాలి. అంతకుముందు కనిపించని ప్రత్యేక వెలుగు ఏదో ఆ పరిశోధనలో ప్రతిఫలించాలి.

అందమైన శైలికి అద్భుతమైన పరిశోధన తోడైతే...అదే 'కోర్టింగ్ ఇండియా' పుస్తకం.

ప్రొఫెసర్ నందిని దాస్ రాసిన 'కోర్టింగ్ ఇండియా: ఇంగ్లాండ్, మొఘల్ ఇండియా అండ్ ది ఆరిజిన్స్ ఆఫ్ ఎంపైర్' పుస్తకం ప్రతిష్ఠాత్మకమైన బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్-2023 గెలుచుకుంది...



● నందినీ దాస్




ఇంట్లో, తరగతి గదిలో, పుస్తకాల్లో, టీవీల్లో విన్న కథల ద్వారా నందిని దాస్‌కు షేక్‌స్పియర్ ఇష్టమైన రచయితగా మారాడు. ఆ మహా రచయితపై ఇష్టం ఆంగ్ల సాహిత్యంపై ఇష్టంగా మారింది. ఆయన పుస్తకాలు తన మనోఫలకంపై ముద్రించుకుపోయాయి.

అలనాటి ప్రయాణ సాహిత్యం నుంచి భిన్న సంస్కృతుల మధ్య వైరుధ్యాల వరకు నందినికి ఎన్నో అంశాలు ఆసక్తికరంగా మారాయి. పరిశోధిస్తూ, రాసే క్రమంలో తన మానసిక ప్రపంచం విశాలం అవుతూ వచ్చింది.

యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో నందిని దాస్ ప్రొఫెసర్. షేక్‌స్పియర్ సాహిత్యం ఆమెకు కొట్టిన పిండి. ఆమె పేరు పక్కన కనిపించే విశేషణం...'స్పెషలిస్ట్ ఇన్ షేక్‌స్పియర్ స్టడీస్'

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో బీఏ ఇంగ్లీష్ చేసింది నందిని. ఆ తరువాత స్కాలర్‌షిప్‌పై యూనివర్శిటీ కాలేజి, ఆక్స్‌ఫర్డ్‌లో చేరింది. కేంబ్రిడ్జ్, ట్రినిటీ కాలేజిలో ఎంఫిల్, పీహెచ్‌డీ చేసింది. ఒక ప్రచురణ సంస్థలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా పని చేసిన నందిని సంవత్సరం తరువాత మళ్లీ అకాడమిక్ రిసెర్చ్‌లోకి వచ్చింది.

ఇక తాజా విషయానికి వస్తే...

'ది పవర్ ఆఫ్ గుడ్ రైటింగ్'గా విశ్లేషకులు కీర్తించిన 'కోర్టింగ్ ఇండియా' యూరోపియన్‌ల హింసా ధోరణి గురించి చెప్పింది. రాయబార కార్యాలయాల అసమర్థతను ఎత్తి చూపింది. మొఘల్ రాజకీయాలను ఆవిష్కరించింది.

' ఆనాటి బ్రిటన్, ఇండియాలకు సంబంధించి వాస్తవిక చిత్రాన్ని ఆవిష్కరించింది నందిని. మొగల్ రాజుల ఒడిదొడుకుల నుంచి బ్రిటీష్ వైఖరి వరకు ఈ పుస్తకంలో ఎన్నో కనిపిస్తాయి' అంటాడు బ్రిటీష్ అకాడమీ బుక్‌ప్రైజ్- ఛైర్ ఆఫ్ ది జ్యూరీ ప్రొఫెసర్ చార్లెస్ ట్రిప్.

వంటిల్లు

చలి కొరుకుడుని తట్టుకోవాలంటే నోటికి కాస్త వేడివేడి రుచులు తగలాల్సిందే. వేడితోపాటు కారం, కరకర లాడే కమ్మదనం తోడయితే చలిని కూడా కొరికేయవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు.

# చలిని వెచ్చగా కొరికేద్దాం!



## పొటాటో పాన్‌కేక్స్

**కావలసినవి:** ఉడికించి చిదుముకున్న బంగాళ దుంపలు – రెండు కప్పులు; గుడ్డు – ఒకటి; మైదా – ముప్పావు కప్పు; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; చీజ్ తరుగు – కప్పు; క్యారట్ తురుము – అర కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; నూనె – అరకప్పు; పుల్లటి పెరుగు – గార్నిష్‌కు సరిపడా.

**తయారీ:** ● గిన్నెలో చిదిమిన దుంపల మిశ్రమం, గుడ్డుసొన, మైదా, స్ప్రింగ్ ఆనియన్, చీజ్ తరుగు, మిరియాలపొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి ● ఈ మిశ్రమం చేతులకు అంటుకుంటున్నట్లు అయితే మరో టేబుల్ స్పూను మైదా వేసి కలపాలి ● పిండి ముద్దను ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిని చిన్నచిన్న ముద్దలుగా చేసి పాన్‌కేక్‌లా వత్తుకోవాలి ● బాణలిలో నూనె వేయాలి. బాగా కాగిన నూనెలో ఒక్కో పాన్‌కేక్‌ను వేసి మీడియం మంట మీద కాల్చాలి ● క్రిస్పీగా బ్రౌన్ కలర్‌లోకి మారాక పాన్‌కేక్‌లను తీసేయాలి ● పాన్‌కేక్ పైన కొద్దిగా పుల్లటి పెరుగువేసి సర్వ్ చేసుకోవాలి.

## పోహా వెజ్ కట్‌లెట్



**కావలసినవి:** అటుకులు – కప్పు; ఉడికించిన బంగాళ దుంపలు – రెండు; క్యాప్సికం తరుగు – రెండు టీస్పూన్లు; క్యారట్ తురుము – రెండు టీస్పూన్లు; పచ్చిబఠాణీ – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ధనియాల పొడి – టీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; కారం – టీస్పూను; పచ్చిమిర్చి పేస్టు – టీస్పూను; కార్న్‌ఫ్లోర్ – రెండు టేబుల్ స్పూన్లు; బ్రెడ్ ముక్కల పొడి – కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● అటుకులను శుభ్రంగా కడిగి పదినిమిషాలు నానబెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత నానిన అటుకుల్లో తొక్కతీసిన దుంపలు, బఠాణీ, క్యాప్సికం, క్యారట్, కొత్తిమీర తరుగు వేయాలి ● పచ్చిమిర్చి పేస్టు, చాట్ మసాలా, ధనియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి ముద్దలా కలపాలి ● పిండిని ఉండలుగా చేసి, కట్‌లెట్‌లా వత్తుకుని పక్కన పెట్టుకోవాలి ● కార్న్‌ఫ్లోర్‌లో నీళ్లు పోసి పేస్టులా కలపాలి ● ఒక్కో కట్‌లెట్‌ను కార్న్‌ఫ్లోర్ పేస్టులో ముంచి, తరువాత బ్రెడ్ ముక్కల పొడిని అద్దాలి ● బ్రెడ్ ముక్కల పొడి అద్దిన తరువాత డీప్ ఫ్రై చేసుకోవాలి ● గోల్డెన్ కలర్‌లోకి మారాక తీసి సాస్ లేదా గ్రీన్ చట్నీతో సర్వ్ చేయాలి.

## పనీర్ కుర్‌కురే



**కావలసినవి:** నిలువుగా కోసిన పనీర్ ముక్కలు – రెండు కప్పులు; పసుపు – టీస్పూను; కారం – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కసూరీ మేథీ – టేబుల్ స్పూన్; వాము – అరటీస్పూను; చాట్ మసాలా – టీస్పూను; గరం మసాలా – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; అల్లం వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను; కార్న్‌ఫ్లేక్స్ – రెండు కప్పులు; శనగపిండి – రెండు కప్పులు; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● పనీర్ ముక్కలపైన చిటికెడు సాల్ట్, కారం, టేబుల్ స్పూను కొత్తిమీర తరుగు, చాట్ మసాలా వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● పెద్ద గిన్నె తీసుకుని శనగపిండి, వాము, అల్లం వెల్లుల్లి పేస్టు, కసూరీ మేథీ, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఇప్పుడు నీళ్లు పోసి బజ్జీపిండిలా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి ● ఒక ప్లేటులో కార్న్ ఫ్లేక్స్‌ను నలిపి పెట్టుకోవాలి ● ఇప్పుడు ఒక్కో పనీర్ ముక్కను తీసుకుని ముందుగా శనగపిండి మిశ్రమంలో ముంచాలి. తరువాత కార్న్‌ఫ్లేక్స్‌ను అద్ది సలసలా కాగుతోన్న నూనెలో వేసి డీప్‌ఫ్రై చేయాలి ● పనీర్ ముక్క క్రిస్పీగా మారితే పన్నీర్ కుర్‌కురే రెడీ.

## పాలక్ మేథీ పూరీ



**కావలసినవి:** జీలకర్ర – టేబుల్ స్పూను; సోంపు – టేబుల్ స్పూను; వాము – టీస్పూను; నువ్వులు – టేబుల్ స్పూను; ధనియాల పొడి – టేబుల్ స్పూను; పచ్చిమిర్చి – మూడు; అల్లం తరుగు – టీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; పాలకూర తరుగు – రెండు కప్పులు; మెంతికూర తరుగు – కప్పు; గోధుమ పిండి – రెండు కప్పులు; శనగపిండి – పావు కప్పు; పసుపు – అరటేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కారం – టేబుల్ స్పూను; నూనె –డీప్‌ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● జీలకర్ర, సోంపు, నువ్వులు, వాము, ధనియాల పొడి, పచ్చిమిర్చి; అల్లం తరుగు, కరివేపాకుని మిక్సీజార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● పాలకూర, మెంతికూర తరుగుని గిన్నెలో వేయాలి. దీనిలోనే గోధుమపిండి, శనగపిండి, కారం, పసుపు, గ్రైండ్ చేసిన మసాలా పొడి, రుచికి సరిపడా ఉప్పు, టేబుల్ స్పూను నూనె వేసి కలపాలి ● ఈ మిశ్రమంలో కొద్ది కొద్దిగా వేడినీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి ● పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పూరీలా మందంగా వత్తుకోవాలి ● గుండ్రని గిన్నె లేదా చిన్న గ్లాసుతో పూరీని చిన్న చిన్న చెక్కల్లా కట్ చేయాలి ● అన్నీ రెడీ అయ్యాక క్రిస్పీగా మారేంత వరకు డీప్ ఫ్రై చేస్తే రుచికరమైన పాలక్ మేథీ పూరీ రెడీ.